www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -68 సోమవారం 22 జూన్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



## సాయికృష్ణ కేసు.. దర్యాప్తునకు సిట్ ఏర్పాటు

**విజయవాడ యువకుడు గాదె సాయికృష్ణ పోలీస్ కస్టడీలో మృతి చెందినట్టు ఆరోపణలు**

**సిట్ ఏర్పాటు చేసిన పోలీస్ డిపార్ట్ మెంట్**

**ఐజీ రవి ప్రకాశ్ నేతృత్వంలో దర్యాప్తునకు ప్రభుత్వ ఆదేశం**

**సస్పెండైన సీఐ నాగరాజుపై హత్య, ఆధారాల ధ్వంసం ఆరోపణలు**

**సీఎం ఆదేశాలతో వేగవంతమైన దర్యాప్తు, సీఐ నాగరాజు విచారణ**

**విజయవాడజూన్ 21 (ప్రజావినికిడి):**
విజయవాడలో సంచలనం సృష్టించిన యువకుడి కస్టడీ మృతి ఆరోపణల కేసు దర్యాప్తును ప్రభుత్వం వేగవంతం చేసింది. 25 ఏళ్ల గాదె సాయికృష్ణ అదృశ్యం, కస్టడీ మృతి ఆరోపణలపై విచారణ జరిపేందుకు ఏపీ పోలీస్ శాఖ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. **మిగతా 2లో...**

## ప్రశాంతంగా నీట్ రీ టెస్ట్

**5400కు పైగా కేంద్రాల్లో నిర్వహణ**

**హైదరాబాద్ లోనూ తరలివచ్చిన అభ్యర్థులు**

**న్యూఢిల్లీ : జూన్ 21 (ప్రజావినికిడి):**
నీట్ యూజీ 2026 రీ టెస్ట్ ఆదివారం దేశవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా జరిగింది. దేశంలోని 551 నగరాల్లోని 5,440 కేంద్రాల్లోనూ, విదేశాల్లోని 14 కేంద్రాల్లోనూ ఈ రీ టెస్టును నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహించింది. ఈ పరీక్షకు 22.79 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. పేపర్ లీక్ కారణంగా మే 3న జరిగిన నీట్ యూజీ 2026 పరీక్షను రద్దు చేసిన సంగతి తెలిసిందే. పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. **మిగతా 2లో...**




# రేవంత్ ఢిల్లీ టూర్

**పలువురు కేంద్ర మంత్రులతో భేటీలు**

**పార్టీ అగ్రనేతలనూ కలిసే అవకాశం**

**న్యూఢిల్లీ జూన్ 21 (ప్రజావినికిడి):**
తెలంగాణ రాష్ట్రాభివృద్ధి, పలు కీలక ప్రాజెక్ట్ అనుమతులే ప్రధాన లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన చేపట్టారు. పలువురు కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తులు చేయనున్నారు. శనివారం ముంబయిలో జరిగిన ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ మనవరాలు, ఎంపీ సుప్రియా సులే కుమార్తె వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అక్కడి నుంచి నేరుగా సాయంత్రం ఏడు గంటలకు ఢిల్లీ చేరుకున్నారు. నేడు, రేపు(22, 23 తేదిల్లో) సీఎం ఢిల్లీలోనే ఉండనున్నట్టు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలపై కేంద్ర మంత్రులతో సీఎం**మిగతా 2లో...**



## తమిళనాడులో ఘోరం

**సీఫుడ్ ఫ్యాక్టరీలో గ్యాస్ లీక్ -ఏడుగురు మహిళల మృతి,**

**తొమ్మిదిమంది పరిస్థితి విషమం**

**విచారణకు సీఎం విజయ్ ఆదేశం**




**చెన్నై: జూన్ 21(ప్రజావినికిడి):**
తమిళనాడులోని సీఫుడ్ ఫ్యాక్టరీలో ఘోరం జరిగింది. తిరువళ్లూరు జిల్లా పెరియపాళయం సమీపంలో ఉన్న ఒక ప్రయి వేట్ సీఫుడ్ ఎగుమతి యూనిట్‌లో ఆదివారం అమ్మోనియా గ్యాస్ లీక్ కావడంతో ఏడుగురు మహిళలు ప్రాణాలు**మిగతా 2లో...**



## చర్చలు షురూ

**స్విట్జర్లాండ్‌లో అమెరికా, ఇరాన్, పాక్, ఖతార్ నేతలు తుది శాంతి ఒప్పందం కోసం కసరత్తు**

**ఇరాన్ అణు కార్యక్రమం, లెబనాన్‌లో కాల్పుల విరమణ సహా అపరిష్కృతంగా ఉన్న కీలక అంశాలపై నిర్ణయం**

**జూన్ 21 (ప్రజావినికిడి):**
మధ్యప్రాచ్యంలో యుద్ధానికి శాశ్వతంగా ముగింపు పలికేందుకు ఉద్దేశించిన తుది ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ఇరాన్, అమెరికా ప్రతినిధులు ఆదివారం స్విట్జర్లాండ్‌లో చర్చలు ప్రారంభించారు. ఇరాన్ అణు కార్యక్రమం, లెబనాన్‌లో కాల్పుల విరమణ సహా అపరిష్కృ తంగా ఉన్న కీలక అంశాలపై ఈ సందర్భంగా చర్చించి నిర్ణయం తీసుకుంటారు. **మిగతా 2లో...**

## రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టులు

**సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం**

**ప్రభుత్వ విజయాలను, సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించడమే లక్ష్యం**

**గతంలో విడుదల చేసిన 7 శ్వేతపత్రాల తరహాలోనే ఈ నివేదికల రూపకల్పన**

**రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు ఎలా నడిపించామో స్పష్టం చేయాలని సూచన**

**అసత్య ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టాలని మంత్రులకు దిశానిర్దేశం**

**అమరావతిజూన్ 21(ప్రజావినికిడి):**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా, ఈ రెండేళ్లలో సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేసేందుకు 'ప్రోగ్రెస్ రిపోర్ట్స్' విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు



అధికారులను, మంత్రులను ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ఎలా అభివృద్ధి పథంలోకి నడిపించారో ఈ నివేదికల ద్వారా ప్రజలకు వివరించాలని ఆయన స్పష్టం చేశారు.
**మిగతా 2లో...**

## తెలంగాణలో మాఫియా రాజ్యం నడుస్తుంది: కెటిఆర్

**హైదరాబాద్ జూన్ 21(ప్రజావినికిడి):**
రాష్ట్రంలో ప్రభుత్వం లేదని ఒక మాఫియా రాజ్యం నడుస్తుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. అందినంత దోచుకో.. దొరికిన కాడికి దాచుకో అనే స్కీము నడుస్తుందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ దండుపాళ్యం బ్యాచ్‌కి రేవంత్ రెడ్డి గుంపు మేస్త్రీగా ఉన్నారని, అందుకే అటు రేవంత్ రెడ్డితో పాటు ప్రతి ఒక్క మంత్రి కాంగ్రెస్ నాయకులు అందిన కాడికి దోచుకుంటున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొడుకు గుండాయిజాన్ని ప్రతి



# యోగాతో హెల్దీ ఆంధ్ర

**బాబా రామ్‌దేవ్‌తో కలిసి చంద్రబాబు, లోకేశ్ యోగాభ్యాసం**



**రాష్ట్రవ్యాప్తంగా 1.33 లక్షల కేంద్రాలలో కోటి మందికి పైగా యోగా సాధన**


**రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచుతామని సీఎం ప్రకటన**

**ఆగస్టు 15 నుంచి 'సంజీవని' ప్రాజెక్ట్ అమలు**

**స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల్లో శాశ్వత యోగా మందిరాల నిర్మాణం**

**అమరావతిజూన్ 21 (ప్రజావినికిడి):**
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహించిన యోగా వేడుకలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్‌తో కలిసి సామూహిక యోగాభ్యాసంలో పాల్గొన్నారు**మిగతా 2లో...**





# శారీరక ఫ్లెక్సిబిలిటీ మన లక్ష్యం కావాలి

**కోల్‌కతాలోని చారిత్రక రెడ్ రోడ్ వేదికగా జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రారంభించిన మోదీ**

**ఈ ఏడాది 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా' అనే ప్రత్యేక థీమ్‌తో వేడుకలు**

**210 భారతీయ రాయబార కార్యాలయాల ఆధ్వర్యంలో 2,500 యోగా ప్రదర్శనలు**

**కోల్‌కతాజూన్ 21 (ప్రజావినికిడి):**
ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించే 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఆదివారం (జూన్ 21, 2026) అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఏడాది భారతదేశపు ప్రధాన జాతీయ వేడుకకు పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని చారిత్రక 'రెడ్ రోడ్' వేదికైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సభకు స్వయంగా హాజరై, **మిగతా 2లో...**

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# యోగాతో హెల్దీ ఆంధ్ర

**మొదటిపేజీ తరువాయి**

ప్రశాంత వాతావరణంలో బాబా రామ్‌దేవ్‌తో కలిసి యోగా చేయడం ఎన్నటికీ మరువలేని అనుభూతిని ఇచ్చిందని ఈ సందర్భంగా సీఎం హర్షం వ్యక్తం చేశారు. యోగాకు అంతర్జాతీయ స్థాయిలో అపారమైన గుర్తింపు తెచ్చి, నేడు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 190 దేశాల్లో ఈ ఉత్సవాలు నిర్వహించేలా చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మోదీ తన చొరవతో ప్రపంచానికి భారతదేశ శక్తులను చాటుతూ, దేశాన్ని అగ్రభాగాన నిలబెడుతున్నారని కొనియాడారు. సాంకేతికత, ఆధ్యాత్మికతల కలయికతోనే సమాజ భవిష్యత్తు ముడిపడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆధ్యాత్మికత, యోగా సాధన ద్వారానే హెల్దీ, వెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ (సుఖీభవ ఏపీ) సాధ్యమవుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో విశాఖపట్నంలో 'యోగాంధ్ర–2025' పేరిట భారీ ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రధాని మోదీ సమక్షంలో గిన్నిస్ బుక్, ప్రపంచ రికార్డులను సృష్టించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. వచ్చే ఏడాది అంతర్జాతీయ యోగా వేడుకలను పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో అత్యంత ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1.33 లక్షల కేంద్రాలలో కోటి మందికి పైగా ప్రజలు యోగా సాధన చేస్తున్నారని, ఈ సంస్కృతిని ఇంటింటికీ చేర్చి ప్రజారోగ్యాన్ని కాపాడటమే తమ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. యోగాను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో బాబా రామ్‌దేవ్ చేసిన అమోఘమైన కృషిని ఈ సందర్భంగా సీఎం అభినందించారు. రాష్ట్రంలో యోగా కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా జిల్లా, మండల స్థాయి అధికారులను నియమిస్తామని, స్టాండర్డ్ యోగా ప్రొటోకాల్స్ రూపొందించడానికి ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. ఇందుకోసం 'యోగాంధ్ర' పేరిట ప్రత్యేక డిజిటల్ పోర్టల్‌ను కూడా తీసుకురానున్నారు. అలాగే, రాష్ట్రంలోని స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో శాశ్వత యోగా మందిరాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్‌లను పూర్తిగా దూరంగా పెట్టాలని, రసాయన రహిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా అనారోగ్యాలను దరిచేరనివ్వకుండా చూసుకోవచ్చని హితవు పలికారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని (గ్రీన్ కవర్) 50 శాతానికి పెంచుతామని చెబుతూ.. రాబోయే ఆగస్టు 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక 'సంజీవని' ప్రాజెక్టును అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వైద్య నిపుణులను ప్రజలకు చేరువ చేయడంతో పాటు యోగాను కూడా అందులో భాగం చేస్తామన్నారు.

## తమిళనాడులో ఘోరం

**మొదటిపేజీ తరువాయి**

కోల్పోయారు. మరో తొమ్మిదిమంది పరిస్థితి విషమంగా ఉంది. 40 మందికి పైగా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం పెరియపాళయం సమీపంలోని కన్నిగైపైర్ వద్ద ఉన్న 'సెయింట్ పీటర్స్ పాల్ సీఫుడ్స్ ఎక్స్‌పోర్ట్స్ ప్రయి వేట్ లిమిటెడ్'లో ఈ లీకేజీ జరిగింది. ఈ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న వారిలో అత్యధికులు మహిళలే. అసోం, ఒడిశా, జార్ఖండ్‌లకు చెందిన సుమారు 120 మంది వలస కార్మికులు ఫ్యాక్టరీ ప్రాంగణంలోనే నివసిస్తున్నారు. ఆదివారం ఉదయం సీఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నుంచి అమ్మోనియా లీక్ మొదలై, వేగంగా ప్రాంగణంలోని నివాస ప్రాంతానికి వ్యాపించింది. వారాంతపు సెలవు కావడంతో తమ గదుల్లోనే ఉన్న చాలా మంది కార్మికులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడగా, కొందరికి నోరు, ముక్కు నుంచి రక్తం కారడం వంటి సమస్యలు తలెత్తాయి.



# రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టులు

**మొదటిపేజీ తరువాయి**

సోమవారం తన క్యాంపు కార్యాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో చంద్రబాబు ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు. 2024లో అధికారంలోకి వచ్చిన వెంటనే గత వైసీపీ ప్రభుత్వ పాలనపై ఏడు అంశాల్లో శ్వేతపత్రాలు విడుదల చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని, విద్యుత్, శాంతిభద్రతలు, మైనింగ్, ఎక్సైజ్ వంటి అంశాలపై వాస్తవ పరిస్థితులను ఆ శ్వేతపత్రాల ద్వారా ప్రజల ముందు ఉంచారు.

ఇప్పుడు ఆ శ్వేతపత్రాలకు కొనసాగింపుగా ఈ 'ప్రోగ్రెస్ రిపోర్ట్స్' ఉండాలని సీఎం సూచించారు. వివిధ శాఖల్లో వచ్చిన మార్పులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా సంస్కరణలను సమగ్రంగా ఇందులో పొందుపరచాలన్నారు. ప్రభుత్వంపై వస్తున్న అసత్య ప్రచారాలను (ఫేక్ న్యూస్) తిప్పికొట్టేందుకు, వాస్తవాలను ప్రజల ముందు ఉంచి రాష్ట్రాన్ని ఎలా గాడిన పెట్టారో స్పష్టంగా తెలియజేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ నివేదికల ద్వారా రెండేళ్ల ప్రభుత్వ పనితీరును ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# ప్రశాంతంగా నీట్ రీ టెస్ట్

**మొదటిపేజీ తరువాయి**

ఈ నేపథ్యంలో ఆదివారం నీట్ పరీక్షను మరోసారి నిర్వహించారు. మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు ఈ పరీక్ష జరిగింది. అయితే వికలాంగ అభ్యర్థులకు సాయంత్రం 6:20 గంటల వరకు పరీక్ష రాయడానికి అనుమతించారు. ఈ పరీక్షను ఇంగ్లీష్‌తో సహా 12 భారతీయ భాషలలో నిర్వహించారు. ఎన్టీఏ అధికారుల సమాచారం ప్రకారం 95,000కు పైగా పరీక్షా గదులలో మొత్తం 1,38,560 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని జాతీయ, రాష్ట్ర, మంత్రిత్వ శాఖల స్థాయిలో వర్చువల్‌గా పర్యవేక్షిస్తున్నామని ఎన్టీఏ అధికారులు తెలిపారు. అలాగే 51,311 జామర్‌లను అందుబాటులో ఉంచినట్టు కూడా చెప్పారు. పరీక్ష సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేలా కేంద్రాల వద్ద డ్రోన్‌లను, అదనపు సిబ్బందిని మోహరించారు. దేశ రాజధానితో సహా అనేక రాష్ట్రాల్లో, పరీక్షా కేంద్రాల వెలుపల వేచి ఉన్న తల్లిదండ్రులు, సంరక్షకుల కోసం ఉచిత తాగునీరు, అల్పాహారం కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. దేశరాజధాని ఓఖ్లాలోని ఎన్టీఏ ప్రధాన కార్యాలయం నుంచి పరీక్ష సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమీక్షించారు. "పరీక్షను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం" అని విద్యా మంత్రిత్వ శాఖ తెలిపింది. కొంత మంది అభ్యర్థులు, అభ్యర్థుల తల్లిదండ్రులతో ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడారు. తమ సమస్యలను వారు మంత్రికి తెలియచేశారు.

# సాయికృష్ణ కేసు.. దర్యాప్తునకు సిట్ ఏర్పాటు

**మొదటిపేజీ తరువాయి**

శాంతిభద్రతల విభాగం ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) ఎం. రవి ప్రకాశ్ ఈ సిట్‌కు నేతృత్వం వహించనున్నారు.

ఈ ప్రత్యేక దర్యాప్తు బృందంలో పశ్చిమ గోదావరి ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ సభ్యులుగా ఉంటారని, బాపట్ల జిల్లా అదనపు ఎస్పీ ఎల్. సుధాకర్‌ను దర్యాప్తు అధికారిగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను వేగంగా పూర్తి చేసేందుకు అవసరమైన సిబ్బందిని, సాంకేతిక, ఫోరెన్సిక్ సహకారాన్ని పోలీస్ శాఖలోని వివిధ విభాగాల నుంచి తీసుకునేందుకు సిట్‌కు పూర్తి అధికారాలు కల్పించారు.

ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న కృష్ణలంక పోలీస్ స్టేషన్ సస్పెండెడ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) నాగరాజు చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. అక్రమ నిర్బంధం, హత్య, సాక్ష్యాల ధ్వంసం వంటి ఆరోపణలపై సిట్ దర్యాప్తు చేయనుంది. మృతుడు సాయికృష్ణ తల్లి గాదె విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూన్ 19న సీఐ నాగరాజుపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 127(4), 127(6), 103(1), 238 కింద కేసు నమోదు చేశారు. సింగ్ నగర్‌లోని ఆయన నివాసంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు విచారణ జరుపుతున్నారు. విచారణ అనంతరం నాగరాజును అరెస్ట్ చేసే అవకాశం ఉంది.

## అసలేం జరిగింది?

విచారణ పేరుతో మే 9న తన కుమారుడిని పోలీసులు తీసుకెళ్లారని, అప్పటి నుంచి అతను తిరిగి రాలేదని తల్లి విజయలక్ష్మి ఆరోపిస్తున్నారు. కస్టడీలో చిత్రహింసలకు గురి చేసి, కొట్టి చంపేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆమె హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయగా, జూన్ 15న సాయి కృష్ణను కోర్టులో హాజరుపరచాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. పోలీసులు విఫలం కావడంతో గడువును జూన్ 29కి పొడిగించింది.

ఈ ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూన్ 17న సీనియర్ ఐపీఎస్ అధికారితో దర్యాప్తునకు ఆదేశించడమే కాకుండా సీఐ నాగరాజును తక్షణమే సస్పెండ్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. దర్యాప్తు బృందాలు ఇప్పటికే విజయలక్ష్మి, ఇతరుల వాంగ్మూలాలను నమోదు చేసి, సీసీటీవీ ఫుటేజీని, ఇతర సాంకేతిక ఆధారాలను సేకరించాయి. సాయికృష్ణను చంపి దహనం చేశారని తల్లి ఆరోపించిన నేపథ్యంలో కృష్ణలంకలోని శ్మశానవాటికలో మే 23 నుంచి 26 మధ్య దహనం చేసిన అనాథ శవాల రికార్డులను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. మరోవైపు మే 1 నుంచి జూన్ 1 వరకు కృష్ణలంక పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజీని, సాయి కృష్ణ, అతని తల్లి మొబైల్ ఫోన్ల కాల్ డేటా రికార్డులను భద్రపరచాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది.

## తెలంగాణలో మాఫియా రాజ్యం నడుస్తుంది: కెటిఆర్

**మొదటిపేజీ తరువాయి**

కాంగ్రెస్ కనుసన్నల్లోనే రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్‌లో 180 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని ప్రైవేట్ వారికి రాసిచ్చిన విషయాన్ని కెటిఆర్ గుర్తుచేశారు

స్వయంగా ముఖ్యమంత్రే ప్రతి ఒక్కరినీ బెదిరిస్తూ మంత్రులు పారిశ్రామికవేత్తల తలలకు తుపాకులు పెడుతూ డబ్బులు ఇస్తారా చస్తారా అని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని విమర్శించారు. రెండున్నర సంవత్సరాలుగా హైదరాబాద్ నగరంలో ఒక్క ఇల్లు కూడా కట్టని కాంగ్రెస్ పార్టీ వేలాది ఇండ్లను కూల్చేందుకు మాత్రం సిద్ధమవుతున్నారని ఆరోపించారు. ఉన్న సిటీని వదిలిపెట్టి సిఎం తాను కబ్జా చేసిన వేలాది ఎకరాలను కాపాడుకోవడం కోసమే ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి తన భూములు చూసుకోవడానికే ఉనికిలో లేని ఫ్యూచర్ సిటీకి అప్పుడప్పుడు వెళ్లి వస్తున్నారని ఆరోపించారు. రాజేంద్రనగర్ స్థానిక ఎంఎల్ఎ అభివృద్ధి పేరుతో పార్టీ మారారని.. కానీ, ఈ రెండున్నర సంవత్సరాలలో చేసిన ఒక్క అభివృద్ధి పని అయినా చెప్పగలరా..? అని కెటిఆర్ ప్రశ్నించారు. ఎంతమంది పెద్ద నేతలు పోయినా గులాబీ సైన్యం బలంగా అలాగే ఉన్నదని చెప్పారు. రానున్న ఎన్నికల్లో కెసిఆర్‌ని తిరిగి ముఖ్యమంత్రిగా తీసుకువచ్చి గులాబీ జెండాను ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కెటిఆర్ పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ పైన కార్యకర్తలకు కెటిఆర్ దిశానిర్దేశం చేశారు.

# రేవంత్ ఢిల్లీ టూర్

**మొదటిపేజీ తరువాయి**

వరుస సమావేశాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగాడ కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, ప్రహ్లాద్ జోషి, అశ్వినీ వైష్ణవ్, మనోహర్‌లాల్ ఖట్టర్, పీయూష్ గోయల్, ఇతర మంత్రుల అపాయింట్మెంట్ కోరినట్టు సమాచారం.రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ

ఢిల్లీ పర్యటనలో ప్రధానంగా కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాత్ సింగ్‌తో సీఎం భేటీ కానున్నట్టు తెలిసింది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది సుందరీకరణ, పునరుజ్జీవన ప్రాజెక్ట్ అభివృద్ధి పనులకు కేంద్ర రక్షణ శాఖ సానుకూలంగా స్పందించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని బాపూఘాట్ వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించడానికి కావాల్సిన 'గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ ' కోసం 83 ఎకరాల భూము లు ఇవ్వడానికి రక్షణ శాఖ అంగీకారం తెలిపింది. గోల్కొండ ఆర్టిలరీ పరిధి లోని రూ. 533 కోట్ల విలువైన భూములు బదలాయింపునకు ఆమోదం తెలిపిం ది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి సీఎం కృతజ్ఞతలు తెలపనున్నారు. అలాగే సికింద్రాబాద్ ఫ్లైఓవర్ నిర్మాణాలకు కంటోన్మెంట్ భూముల అప్పగింత, సైనిక్ స్కూల్, ఇతర రక్షణ భూముల బదలాయింపు అంశాలపై మరోసారి విజ్ఞప్తి చేయనున్నట్టు సమాచారం. రైతు సమస్యలపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషితో చర్చలు అభివృద్ధితో పాటు రైతులు ఎదుర్కొంటోన్న సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నారు. ముఖ్యంగా పారా బాయిల్డ్ బియ్యం, ధాన్యం ఉత్పత్తి, బకాయిల విడుదల అంశంపై కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో ముఖ్యమంత్రి భేటీ కానున్నట్టు సమాచారం. గత పర్యటనలో భాగంగా పారాబాయిల్డ్ బియ్యాన్ని సేకరించాలని సీఎం కోరారు. అలాగే ఈసారి భారీ దిగుబడి నేపథ్యంలో అంచనాకు మించిన సేకరణ, రాష్ట్రం లో బియ్యం సేకరణలో కలుగుతోన్న ఇబ్బందులపై చర్చించనున్నారు. దీంతో పాటు పాఠశాలలు, హాస్టళ్లు, ఐసీడీఎస్ కేంద్రాల ద్వారా ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్ (ఎఫ్ఆర్‌కే) పంపిణీని పునరుద్ధరించాలని కోరనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

**రైల్వే మంత్రితో భేటీ..**

వీటితో పాటు హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశ విస్తరణ, దానికి సంబంధించిన నిధుల సమీకరణపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. మెట్రో ప్రాజెక్టు కోసం ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) నుంచి రుణం పొందే అంశంపై చర్చించేందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అపాయింట్మెంట్ కోరినట్టు తెలిసింది. ఈ భేటీలోడ మెట్రో రైల్ ప్రాజెక్ట్ పురోగతికి సహకరించాలని కోరనున్నారు. అయితేడ కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. ఈ నెల 22 లేదా 23వ తేదీల్లో ఢిల్లీలో ఉంటాననీ.. రైల్వే మంత్రితో సమయం ఖరారు చేయిస్తే, ఇద్దరం కలిసి వెళ్లి తెలంగాణకు అత్యంత కీలకమైన ఈ అంశాలపై చర్చిద్దామని లేఖలో స్పష్టం చేశారు. మెట్రో రైల్ ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని కోరుతూ ఈ నెల 18నే అన్ని వివరాలతో కూడిన లేఖను పంపినట్టు సీఎం గుర్తుచేశారు. కాగాడ ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని ఒప్పంద పత్రాలు, అనుబంధ డాక్యుమెంట్లు, వాస్తవ రికార్డులతో ఢిల్లీలో ఉండాలని సీఎం అధికారులను ఆదేశించినట్టు సమాచారం. అలాగే కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అపాయింట్‌మెంట్‌ను సీఎంఓ కోరినట్టు తెలిసింది. జహీరాబాద్ ఇండస్ట్రియల్, వరంగల్ మెగా టెక్స్టైల్ పార్క్, హైదరాబాద్‌విజయవాడ పారిశ్రామిక కారిడార్, ఇతర అంశాలపై చర్చించనున్నట్టు సమాచారం. వీరితో పాటు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఇతర మంత్రుల సమయం కోరినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

## శారీరక ఫ్లెక్సిబిలిటీ మన లక్ష్యం కావాలి

**మొదటిపేజీ తరువాయి**

వేలాది మంది ఉత్సాహవంతులైన ప్రతినిధులు, సాధారణ ప్రజలతో కలిసి సామూహిక యోగాసనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా' అనే ప్రత్యేక నినాదంతో (థీమ్) నిర్వహించారు. వయసుతో సంబంధం లేకుండా శారీరక చలనశీలత, మానసిక ప్రశాంతత, రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవడంలో యోగా ఎంతగానో దోహదపడుతుందని ఈ సందర్భంగా ప్రధాని నొక్కిచెప్పారు.రెడ్ రోడ్‌పై ఏర్పాటు చేసిన భారీ బహిరంగ వేదిక నుంచి మోదీ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. యోగా అనేది ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని అనుసంధానించే ఒక గొప్ప సామూహిక శక్తిగా ఎదిగిందని కొనియాడారు. "మనం 20 ఏళ్ల వయసులో ఉన్నప్పటి కంటే 40 ఏళ్ల వయసు వచ్చేసరికి మరింత శారీరక ఫ్లెక్సిబిలిటీని సాధించడమే మన లక్ష్యం కావాలి" అని పిలుపునిచ్చారు. కోల్‌కతా నగరం ఈ ప్రధాన జాతీయ కార్యక్రమానికి ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి కావడంతో, నగరవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ వేడుకల సన్నాహకంగా నగరంలో ముందస్తుగా 'దౌడ్ సే ధ్యాన్' (పరుగు నుండి ధ్యానం వైపు) మారథాన్, డ్రోన్ ప్రదర్శనలు నిర్వహించారు. ముఖ్యంగా గంగానదిపై 500 పడవల్లో ఒకేసారి యోగాసనాలు వేసి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించేందుకు చేసిన ప్రయత్నం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సహా పలువురు ఉన్నతాధికారులు రాజకీయాలకు అతీతంగా పాల్గొని యోగా విశిష్టతను చాటారు.భారతదేశం ప్రతిపాదించిన ఈ యోగా సంస్కృతి ప్రపంచవ్యాప్తంగా డిజిటల్, భౌతిక రూపాల్లో విస్తరించింది. విదేశాల్లోని దాదాపు 210 భారతీయ దౌత్య కార్యాలయాల సమన్వయంతో అంతర్జాతీయంగా 2,500కి పైగా ప్రధాన నగరాలు, సాంస్కృతిక కేంద్రాలలో యోగా ఉత్సవాలు జరిగాయి. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం కూడా ఈ దినోత్సవాన్ని ప్రత్యేకంగా నిర్వహించింది. దేశంలోని కర్ణాటక, ఢిల్లీతో పాటు అన్ని రాష్ట్రాల్లోనూ స్వచ్ఛత, ఫిట్‌నెస్ కార్యక్రమాలతో ముడిపెట్టి సామూహిక యోగా సెషన్లను ఏర్పాటు చేశారు. ఎలాంటి ఖరీదైన పరికరాలు అవసరం లేకుండా, కేవలం శ్వాసపై నియంత్రణ, శారీరక సమతుల్యత ద్వారా ఒత్తిడిని తగ్గించి, నిద్రలేమి సమస్యలను దూరం చేసే యోగా విధానం.. ప్రస్తుత ఆధునిక వేగవంతమైన ప్రపంచంలో మానవాళికి ఒక సంజీవనిలా మారుతుందని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# చర్చలు షురూ

**మొదటిపేజీ తరువాయి**

చర్చలలో పాల్గొనేందుకు అమెరికా ఉపాధ్యక్షు డు జేడీ వాన్స్ ఇప్పటికే స్విట్జర్లాండ్ చేరుకున్నారు. తెల్లవారుజామున ఎమ్మెన్ వైమానిక స్థావరంలో సతీమణి ఉషా వాన్స్‌తో కలిసి దిగిన ఆయన సాయుధ గార్డులు పహరా కాస్తున్న అనేక చెక్ పాయింట్లు, పచ్చని కొండలను దాటుకుంటూ ఓ ఇరుకైన రహదారి మీదుగా రిసార్టుకు చేరుకున్నారు. బర్గెన్‌స్టాక్ పట్టణం లోని విలాసవంత మైన హోటల్ కాంప్లెక్స్‌లో చర్చలు జరుగుతున్నా యి. వాన్స్‌తో పాటు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ కూడా చర్చలలో భాగస్వాములవుతున్నారు. తొలి విడత చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సైనిక దళాల ప్రధానాధికారి అశిమ్ మునీర్ కూడా స్విట్జర్లాండ్ చేరుకున్నారు. 'ఇస్లామా బాద్ ఎంఓయూ' అమలుపై జరిగే ఉన్నత స్థాయి చర్చలలో వీరు కూడా పాల్గొంటారని పాక్ ప్రధాని కార్యాలయం సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో తెలిపింది. ఖతార్ ప్రధాని షేక్ మహమ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ బిన్ జాసిమ్ అల్ థానీ కూడా చర్చలలో పాల్గొనే అవకాశం ఉన్నదని తెలుస్తోంది. చర్చలలో ఇరాన్ బృందానికి పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘలీబఫ్, విదే శాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ నేతృత్వం వహిస్తుండగా సీcయర్ సెక్యూరిటీ, సెంట్రల్ బ్యాంక్, చమురు అధికారులు సభ్యులుగా ఉన్నారు.

**ఎంఓయూలోని మరిన్ని విషయాలను బయటపెట్టిన పెజెష్కియాన్**

అమెరికాతో కుదుర్చుకున్న ఎంఓయూలో ఉన్న మరికొన్ని అంశాలను ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ బయటపెట్టా రు. ఆయన అందించిన వివరాల ప్రకారం స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులలో ఆరు బిలియన్ డాలర్లు ఖతార్ వద్ద ఉన్నాయి. ఎంఓయూ ప్రకారం ఇప్పుడు అవి ఇరాన్ కు తిరిగి వస్తాయి. 'ఎంఓయూలో నిబంధనలన్నీ మాకు అనుకూలంగా ఉన్నాయి. చర్చలు, సంప్రదింపులలో మేము సాధించినవి త్వరలోనే తెలుస్తాయి' అని పెజెష్కియాన్‌ను ఉటంకిస్తూ తస్నిమ్ వార్తా సంస్థ తెలియజేసింది. గతంలో అమెరికా వేటినైతే నిషేధించిందో ఇప్పుడు వాటినే ఇరాన్ ప్రజల హక్కు లుగా ప్రకటించిందని ఆయన చెప్పారు. స్విట్జర్లాండ్ చర్చలపై అసంతృప్తి వ్యక్తం చేసే వ్యక్తి ఎవరైనా ఉంటే ఆయన ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూయేనని వ్యాఖ్యాంcచారు. 'మా వద్ద అణుబాంబు ఉండకూడదన్నది అమెరికా ప్రధాన ఉద్దేశం. మాకు అణుబాంబు వద్దని అమరుడైన మా సుప్రీం నేత పదే పదే చెప్పారు. అదే విషయాన్ని లిఖితపూర్వకంగా చెప్పాలని అమెరికా అడిగింది. మేము అలాగే రాసి ఇచ్చాం' అని అన్నారు. కాగా ఎంఓయూలోc 14 పాయింట్లలో మొదటి దానినే అమెరికా అమలు చేయలేకపోతోందని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ సలహాదారు మహమ్మద్ మఖ్బర్ ఎద్దేవా చేశారు. లెబనాన్‌లో దాడులు సహా అన్ని రకాల సైcక చర్యలు ఆగిపోతాయని ఎంఓయూలో అమెరికా హామీ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. ఒప్పందం కేవలం కాగితాలకే పరిమితమైనంత కాలం మధ్యప్రాచ్య చమురు సరఫరాలు నిలిచిపోతాయని స్పష్టం చేశారు. ఎంఓయూలో ఇచ్చిన హామీల అమలుకు పట్టుబడతామని ఇస్మాయిల్ బాఘై చెప్పారు.

**హోర్ముజ్‌పై భిన్న వాదనలు**

తుది విడత చర్చలు జరిపేందుకు వీలుగా కాల్పుల విరమణను ఇరాన్, అమెరికా దేశాలు మరో 60 రోజులు పొడిగించిన విషయం తెలిసిందే. లెబనాన్‌లో ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ హోర్ముజ్ జలసంధిని మరోసారి మూసివేస్తున్నామని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఇప్పటికే ప్రకటించింది. అయితే హోర్ముజ్‌లో వాణిజ్య నౌకల రాకపోకలు యధావిధిగా కొనసాగుతున్నాయని, శనివారం యాభై ఐదు నౌకలు హోర్ముజ్ మీదుగా ప్రయాణించాయని అమెరికా సెంట్రల్ కమాండ్ చెప్పింది. ఈ నౌకలలో 17 మిలియన్ బ్యారల్స్ చమురు అంతర్జాతీయ మార్కెట్లకు రవాణా అవుతోంది.

**లెబనాన్‌లో కొనసాగిన ఇజ్రాయిల్ దాడులు**

ఓ వైపు ఇరాన్, అమెరికా, పాకిస్తాన్, ఖతార్ నేతలు స్విట్జర్లాండ్‌లో చర్చలు ప్రారంభించగా మరోవైపు దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయిల్ సేనలు బాంబు దాడులు కొనసాగించాయి. ఇజ్రాయిల్ వైపు నుంచి అనేక డ్రోన్లు లెబనాన్‌లోని లక్ష్యాల వైపు దూసుకొచ్చాయి. ఇజ్రాయిల్ దాడుల కారణంగా గత రెండు రోజులలో అనేక మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. శనివారం జరిగిన దాడులలో 16 మంది చనిపోగా 12 మంది గాయపడ్డారు. టైర్ జిల్లాలోని బరిష్ గ్రామంపై జరిగిన దాడిలో ఒకే కcటుంబానికి చెందిన నలుగురు చనిపోయారు. అలాగే పశ్చిమ బెక్కా వ్యాలీలోని సొహ్మార్‌లో ఓ ఇంటిపై జరిగిన దాడిలో అందులో నివసిస్తున్న నలుగురు మరణించగా ఒకరు గాయపడ్డారు. సిడన్ జిల్లాలోని ఖానారిట్‌పై జరిగిన దాడిలో ఏడుగురు చనిపోగా 13 మంది గాయపడ్డారు. శుక్రవారం వివిధ ప్రాంతాలపై ఇజ్రాయిల్ జరిపిన దాడులలో 83 మంది మరణించగా 141 మంది గాయపడ్డారని లెబనాన్ ప్రజారోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

**డీల్ కుదరకపోతే హోర్ముజ్‌లో సుంకాలు విధిస్తాం : ట్రంప్**

అరవై రోజుల కాల్పుల విరమణ గడువు ముగిసే లోగా ఇరాన్‌తో తుది ఒప్పందం జరగకపోతే హోర్ముజ్ జలసంధిలో ప్రయాణించే నౌకలపై టోల్స్ (సుంకాలు) విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. 'కాల్పుల విరమణ అమలులో ఉన్నంత కాలం సుంకాలు ఉండవు. వాటిని విధించేది మేమే. మేము ఆ పని చేసే వరకూ అవి ఉండవు. ఒప్పందం కుదరని పక్షంలో మాత్రం మధ్యప్రాచ్య దేశాలకు అందించిన సేవల నిమిత్తండగత, ప్రస్తుత, భవిష్యత్ ఖర్చుల భర్తీ కోసండఅమెరికా స్వయంగా సుంకాలు విధిస్తుంది' అని ఆయన తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో తెలిపారు.

**చర్చల ఎజెండాపై ఇరాన్ ఏమంది?**

ఇజ్రాయిల్–హిజ్బుల్లా మధ్య లెబనాన్‌లో జరుగుతున్న ఘర్షణలు ఈ చర్చల ఎజెండాలో అగ్ర స్థానంలో ఉంటాయని ఇరాన్ తెలియజేసింది. ఇచ్చిన హామీలన్నింటినీ ఇజ్రాయిల్ ప్రభుత్వం ఉల్లంఘిస్తూనే ఉన్నదని, కాబట్టి చర్చలలో అదే ప్రధానాంశం అవుతుందని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘై చెప్పారు. స్తంభింపజేసిన ఆస్తులను ఇరాన్ కు అందుబాటులోకి తేవడం, ఇరాన్ చమురు అమ్మకాలకు అవసరమైన లైసెన్సులు జారీ చేయడం కూడా చర్చల ఎజెండాలో ఉన్నాయని వివరించారు. కాగా కాల్పుల విరమణ కొనసాగుతుందన్న నమ్మకం ఉన్నదని స్విట్జర్లాండ్ బయలుదేరి వెళ్లడానికి ముందు వాన్స్ చెప్పారు. హోర్ముజ్‌ను ఇరాన్ మూసివేసిందని చెప్పడానికి ఆధారాలేవీ లేవని ఆయన అన్నారు

### ప్రకృతి అద్భుత సృష్టుల స్ఫూర్తితో రూపొందిన

# 'నువా' న్యాచురల్ డైమండ్ ఆభరణాల కలెక్షన్‌ను

## ఆవిష్కరించిన మలబార్ గోల్డ్ & డైమండ్స్





**హైదరాబాద్ /దిల్సుక్నగర్,(ప్రజావినికిడి):**
మలబార్ గోల్డ్ & డైమండ్స్ తన తాజా న్యాచురల్ డైమండ్ ఆభరణాల కలెక్షన్ 'నువా' (ఎన్ యు డబ్ల్యూ ఏ) ను ఆవిష్కరించింది.

ప్రకృతిలో కనిపించే సున్నితమైన ఆకృతులు, నిర్మాణాలు అందమైన వివరాల నుంచి స్ఫూర్తి పొందిన ఈ కలెక్షన్,ప్రకృతి అద్భుతాలను ఆధునిక విలాసవంతమైన శైలితో మేళవించే ప్రత్యేక ప్రయత్నంగా రూపొందించబడింది.గీతలు, తేనెగూడు నమూనాలు, భూమి సహజంగా సృష్టించిన ఆకృతులు జీవంతో నిండిన ప్రకృతి డిజైన్‌ల వంటి తరచుగా మన దృష్టికి అందని సూక్ష్మ అంశాలను ఈ కలెక్షన్ సంబరంగా ప్రతిబింబిస్తుంది.

18 క్యారెట్ మరియు 14 క్యారెట్ బంగారంతో రూపొందించిన ఈ కలెక్షన్‌లో న్యాచురల్ డైమండ్స్‌ను రంగురంగుల రత్నాలు,సిరామిక్ కలర్ ఎనామెలింగ్ బహువర్ణ రోడియం ఫినిష్‌లతో సమన్వయం చేసి మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. నిర్మాణ బలాన్ని, సున్నితమైన అందాన్ని సమతుల్యం చేసే ఈ ఆభరణాలు వివిధ సందర్భాలకు అనువుగా ఉండే ఆధునిక సొగసైన రూపాన్ని అందిస్తాయి.ప్రతి డిజైన్ ప్రకృతి ఆకృతుల వైవిధ్యాన్ని నైపుణ్యపూర్వకమైన హస్తకళ, ప్రవాహమయమైన రూపాలు సమకాలీన సౌందర్యంతో వ్యక్తపరుస్తుంది.

మలబార్ గోల్డ్ & డైమండ్స్ నువా కలెక్షన్ యొక్క ఈ కొత్త ఎడిషన్, న్యాచురల్ డైమండ్స్ ద్వారా ఆధునిక విలాసాన్ని సంబరంగా జరుపుకుంటూ, ప్రకృతి అత్యుత్తమ సృష్టులు ప్రపంచవ్యాప్త డిజైన్ ప్రభావాలను ప్రతిబింబిస్తుంది.ఈ కలెక్షన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ నటి కరీనా కపూర్ ఖాన్ కొనసాగుతున్నారుఆమె సహజమైన సొగసు, ఆత్మవిశ్వాసం మరియు కాలాతీత ఆకర్షణ, వ్యక్తిత్వం, ఆధునిక స్త్రీత్వం మరియు శాశ్వత విలాసాన్ని వేడుక చేసుకునే ఈ కలెక్షన్ స్ఫూర్తిని అద్భుతంగా ప్రతిబింబిస్తాయి.

ఈ ఆవిష్కరణపై మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పీ. అహ్మద్ మాట్లాడుతూ,

"మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని నిశ్శబ్దంగా ఆకారమిస్తున్న ప్రకృతి యొక్క సూక్ష్మ నిర్మాణాలు, ఆకృతులు వివరాల అందాన్ని వేడుక చేసుకోవడమే ఈ కలెక్షన్ ప్రధాన ఉద్దేశ్యం.నువా ద్వారా ఆ సహజ సౌందర్యాన్ని ఆధునిక న్యాచురల్ డైమండ్ ఆభరణాల కలెక్షన్‌గా మలచాలని మేము కోరుకున్నాము. ఇది సొగసైనదిగా ఉండటంతో పాటు వివిధ సందర్భాలకు అనువుగా,నేటి మహిళల జీవనశైలికి సరిపోయేలా ఉండాలనేది మా లక్ష్యం.ప్రతి ఆభరణం అత్యుత్తమ హస్తకళను సహజ విలాసాన్ని సమతుల్యం చేస్తూ,తరతరాల పాటు ఆస్వాదించదగిన విధంగా రూపొందించబడింది.సరళమైన విలాసాన్ని మరియు అర్థవంతమైన డిజైన్‌ను అభినందించే మహిళల కోసం ఈ కలెక్షన్ రూపొందించబడింది.ప్రకృతిలో కనిపించే సమతుల్యత మరియు సామరస్యం ఈ డిజైన్‌లకు ప్రేరణగా నిలిచి, సూక్ష్మ వివరాలు మరియు బలమైన దృశ్య ప్రభావాన్ని సమన్వయం చేస్తూ ఆధునిక న్యాచురల్ డైమండ్ ఆభరణాలకు ప్రత్యేక గుర్తింపును అందిస్తుంది.నువా ద్వారా మలబార్ గోల్డ్ & డైమండ్స్ తన న్యాచురల్ డైమండ్ పోర్ట్‌ఫోలియోను మరింత బలోపేతం చేస్తోంది.హస్తకళా నైపుణ్యం, డిజైన్ ఆవిష్కరణ మరియు సమకాలీన విలాసాన్ని సమన్వయం చేసే ఈ కలెక్షన్, కాలాతీతమైన ప్రకృతి ప్రేరణలపై ఆధారపడి రూపొందించబడింది.

# ఘనంగా లక్ష్మీ నరసమ్మ దశదిన కర్మ



**మల్కాజ్ గిరి, (ప్రజావినికిడి):**
భూపాల్ శ్రీనివాస రావు మాతృ స్వరూపిణి అయిన లక్ష్మీ నరసమ్మ దశదిన కర్మను నేడు ఆనంద్ బాగ్ లోని ఆర్ ఎస్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖుల, బంధుమిత్రులు, ఆత్మీయులు విచ్చేసి వారి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. వారు చేసిన సేవలను పలువురు స్మరించుకున్నారు. లక్ష్మీ నరసమ్మ ఎంతో మందికి ఆదర్శ నీయురాలని కొనియాడారు. కార్యక్రమంలో లక్ష్మీ నరసమ్మ కుమారుడు భూపాల్ శ్రీనివాస రావు,వారి సతీమణి భూపాల్ దీపిక,మనవడు ధీరజ్,భరత్, కుమార్తెలు, మనవరాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సమక్య భవనాలకు, శంకుస్థాపన



**వాజేడు,(ప్రజావినికిడి):** గుమ్మడిదొడ్డి గ్రామపంచాయతీ పరిదిలో మూడు గ్రామాలలో మహిళ సమైక్య భవనాలు పని ప్రారంభించిన సర్పంచ్ బొదెబోయిన భరత్ కుమార్,ఈ కార్యక్రమంలో మాట్లాడుతు మంత్రి సీతక్క సహకారంతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి మహిళా సమైక్య భవనాలను సర్పంచ్ ఆధ్వర్యంలో పని ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమానికి, కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ మహిళ సంఘాలు మహిళలు ప్రజాప్రతినిధులు గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

# పేదల గుడిసెలపై కన్ను


### కూల్చివేసిన వారే ప్రతి గుడిసెకు నష్టపరిహారం..

### లక్ష రూపాయలు ఇచ్చి వారిని ఆదుకోవాలి..ఎండి ఫైమీద..



**హనుమకొండ,(ప్రజావినికిడి):**
హనుమకొండ జిల్లాలోని గుండ్ల సింగారం లో పేదల ఇండ్లు కూల్చివేతకు పాల్పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు లేని వారికి ఇండ్లు ఇచ్చేది పోయి కూల్చివేతకు పాల్పడుతున్న రోజువారి కూలీ, చేస్తే కానీ,తినలేని పరిస్థితి లో ఉన్న పేదవారి గుడిసెలను తీసివేయడం, ఇంతవరకు సమంజసం,పాలకవర్గాలకు కొమ్ముకాస్తున్న బడా పెట్టుబడిదారులకు భూ కబ్జాదారులకు,ఎటువంటి ఆంక్షలు లేవు పేదవాడు చిన్న గుడిసె వేసుకుంటే చూడలేని ప్రభుత్వం గుండ్ల సింగారంలో గుడిసెలను తీసేసిన వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే ఇవ్వాలని లేనియెడల సిపిఐ వామపక్షాల ఆధ్వర్యంలో రాబోయే రోజులలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడతామని సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ఎండి ఫైమీద డిమాండ్,ఆవేదన వ్యక్తం చేశారు లేదంటే ప్రతి గుడిసె వాసుకి సోషల్ ఎకనామికల్ సర్వే ద్వారా ఇండ్లు లేని వారికి అక్కడే ఇల్లు కట్టించే విధంగా ప్రభుత్వము వారి ఆదుకోవాలని లేనియెడల తగిన గుణపాఠం పేదలు చెప్తారని అట్లాగే అక్కడున్న వారిపై అక్రమ కేసులను ఎత్తివేయాలని ఎవరైతే ఎకరాలు ఎకరాలు కబ్జా చేశారు వారిపై మీ ప్రతాపం చూయించండి కనీసం ప్రభుత్వానికైనా
ఆ స్థలము ఆదాయము మిగులుతుంది పేదవాడి పై మీ ప్రతాపమా ఇండ్లు ఇళ్ల,ఇస్తామని చెప్పిన ప్రభుత్వమే ఇండ్లు కూల్చే పని చేపడుతుంది గుడిసెలు వేసినందుకు ప్రభుత్వ స్థలాలు ప్రభుత్వాల దృష్టికి వస్తున్నాయి లేదంటే అవి కూడా మాయం అవుతాయి అట్లాగే రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడెక్కడ గుడిసె వాసులు నివసిస్తున్నారు. వారందరికీ ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలి అట్లాగే,ఇల్లు లేని వారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరడం జరిగింది.

## నీట్ విద్యార్థులు ఆ సౌకర్యం వినియోగించుకోవడం చూశాక మనసంతా ఆనందంతో నిండిపోయింది: పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ ,(ప్రజావినికిడి):**
రీ-నీట్ పరీక్ష సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం కల్పించిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వేలాది మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రత్యేక సౌకర్యం ద్వారా విద్యార్థులు ఎలాంటి రవాణా ఇబ్బందులు లేకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాశారని ఆయన తెలిపారు. నీట్ విద్యార్థులు ఉచిత ప్రయాణ సౌకర్యం వినియోగించుకోవడం చూశాక మనసంతా ఆనందంతో నిండిపోయిందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయం, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఈ ఉచిత ప్రయాణ సౌకర్యంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు.విద్యార్థుల ఉన్నత లక్ష్యాల సాధనలో వారికి అన్ని విధాలుగా అండగా నిలిచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రజా పాలనలో భాగంగా విద్యార్థుల సంక్షేమానికి మరిన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

# కొత్తపేట ఆర్యవైశ్య మహిళా సంఘం తొలి నూతన కార్యవర్గం ఎన్నిక





**కొత్తపేట,(ప్రజావినికిడి):**
కొత్తపేట ఆర్యవైశ్య మహిళా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక అధ్యక్షురాలిగా మాధురి పద్మావతి జనరల్ సెక్రటరీగా లక్ష్మి సుజాత ఎంపిక ఈ ప్రమాణస్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథులుగా కొత్తపేట మాజి కార్పొరేటర్ పవన్ కుమార్ తో కలిసి చైతన్యపురి బిజెపి సీనియర్ కార్యకర్త జయంతి గుప్తా పాల్గొనడం జరిగింది కొత్తపేట ప్రాంతంలో ఆర్యవైశ్య మహిళా సమాజ అభివృద్ధి, ఐక్యత సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ లక్ష్యంగా నూతనంగా ఏర్పాటు చేసిన కొత్తపేట ఆర్యవైశ్య మహిళా సంఘం కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
సంఘం తొలి అధ్యక్షురాలిగా మాధురి పద్మావతి,జనరల్ సెక్రటరీగా లక్ష్మి సుజాత ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా సంఘ సభ్యులు నూతనంగా ఎన్నికైన నాయకత్వానికి అభినందనలు తెలియజేస్తూ, వారి ఆధ్వర్యంలో సంఘం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.
నూతన అధ్యక్షురాలు మాధురి పద్మావతి మాట్లాడుతూ, ఆర్యవైశ్య సమాజ ఐక్యత,యువత ప్రోత్సాహం, మహిళా సాధికారత,విద్యా సేవా కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. సమాజంలోని ప్రతి కుటుంబాన్ని సంఘ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసి,పరస్పర సహకారంతో సంఘాన్ని బలోపేతం చేయడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.జనరల్ సెక్రటరీ లక్ష్మి సుజాత మాట్లాడుతూ, సంఘం ద్వారా విద్యార్థులకు ప్రోత్సాహక కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. సమాజ సభ్యులందరి సహకారంతో సంఘాన్ని ఆదర్శవంతమైన సంస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు.ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ, నూతన కార్యవర్గం సమాజ అభివృద్ధికి కృషి చేస్తూ ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం విశేష సేవలు అందిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.కొత్తపేట ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గానికి పలువురు సామాజిక, వ్యాపార, రాజకీయ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు రాజేష్ గుప్తా, శరణ్,వంశి తదితరులు పాల్గొన్నారు.

# దూసకల్ గ్రామంలో 6వ వార్డులో కొత్త వీధి దీపం ఏర్పాటు

### 6వ వార్డు లింగారం మహేష్ ఆధ్వర్యంలో ప్రజల్లో హర్షం



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
దూసకల్ గ్రామం 6వ వార్డు లింగారం మహేష్ తన సొంత కర్చుతో ప్రజల సౌకర్యార్థం కోసం కొత్త స్ట్రీట్ లైట్ ఏర్పాటు చేయడం జరిగింది.వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించిన వార్డు సభ్యుడు మహేష్ వార్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వీధి లైట్ ను ఏర్పాటు చేశారు.గత కొంతకాలంగా ఆ ప్రాంతంలో సరైన వెలుతురు లేకపోవడంతో రాత్రి సమయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారఅని తెలుసుకొని
కొత్తగా ఏర్పాటు చేసిన వీధి లైట్ వల్ల రాత్రి వేళల్లో ప్రజలకు మెరుగైన వెలుతురు అందడంతో పాటు వార్డు ప్రజలు, సురక్షితంగా రాకపోకలు సాగించే అవకాశం కలిగింది.అలాగే ప్రమాదాలు,తగ్గే అవకాశముందని స్థానికులు అభిప్రాయపడ్డారు.
ఈ సందర్భంగా వార్డు సభ్యుడు మహేష్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, వార్డులో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.మన వార్డ్ అభివృద్ధి కోసం ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.
వీధి లైట్ ఏర్పాటు చేసినందుకు స్థానిక ప్రజలు వార్డు సభ్యుడు మహేష్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు.మన వార్డ్ లో ఎలాంటి సమస్య ఉన్నా నేను తీరుస్తాఅనీ మాట ఇచ్చిన మహేష్ ఆ విధంగానే వీధిలైట్ ను వేయించాను అని అన్నారు. ఎల్లప్పుడు మీకు అందుబాటులో ఉంటూ మీ సమస్యల పరిష్కారానికి నేనున్నానని అన్నారు.
ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త, నయీం,అర్షద్ పాల్గొని గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చెయ్యాలని పేర్కొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలలోకి బలంగా తీసుకెళ్లాలి..

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. - రాజేంద్రనగర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఎస్ఐఆర్(సార్) ప్రక్రియ పై అవగాహన కల్పించిన కేటీఆర్..**

**పాల్గొన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి,మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్..**

**ఎమ్మెల్సీలు నవీన్ రెడ్డి,సురభి వాణీదేవి.. - మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి,అంజయ్య యాదవ్,**

**-రాజేంద్ర నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి,సీనియర్ నాయకులు రావుల శ్రీధర్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులు..**





**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
రంగారెడ్డి జిల్లా రాజేంద్ర నగర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఎస్ఐఆర్(సార్) ప్రక్రియ పై అవగాహన కల్పిస్తూ దాని ప్రాముఖ్యతను కార్యకర్తలకు తెలియ జేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ గాంధీ పేరుతో రేవంత్ రెడ్డి చేస్తున్న ఈ విధ్వంసాన్ని చూస్తే మహాత్ముని ఆత్మ కూడా ఘోషిస్తుందన్నారురేవంత్ రెడ్డి నమ్మేది గాడ్సేను అయినా.. మహాత్మా గాంధీ విగ్రహం పెడతానని దొంగ మాటలు చెబుతున్నారని,గాంధీపై



ప్రేమ ఉంటే పేదల ఇండ్లు కూల్చకుండా విగ్రహం కట్టాలని అన్నారు.మూసీ పేరుతో కాంగ్రెస్ చేస్తున్న విధ్వంసపు రాజకీయాలకు బీజేపీ పార్టీ కూడా మద్దతు ఇస్తున్నదని,మోడీకి నిజాయితీ ఉంటే పేదల భూములు లాక్కోవద్దని వారికి అన్యాయం చేయవద్దు అని ఎందుకు ప్రశ్నించరని అన్నారు.నిరుపేదల ఇండ్లను కూలుస్తూ మూసీ భూములు కొల్లగొడుతున్నారని కాంగ్రెస్ గద్దెనెక్కి రెండున్నరేళ్లు దాటినా.. ఒక్కటంటే ఒక్క హామీ నెరవేర్చేందుకు డబ్బులు లేవని చెబుతున్న రేవంత్ రెడ్డి,మూసీలో మాత్రం లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడానికి సిద్ధమవుతున్నాడు.రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఓడించాలని ప్రజలంతా ఎదురుచూస్తున్నారని అన్నారు.

# ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగాను ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగం చేసుకోవాలి..

**రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ..**

**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి స్టేడియంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగానిర్వహించిన12వ అంతర్జాతీయ యోగా కార్యక్రమం లో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన సాంస్కృతిక వారసత్వమని, ఇది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా మనస్సు,శరీరం, ఆత్మల మధ్య సమతుల్యతను నెలకొల్పే సమగ్ర జీవన విధానమని పేర్కొన్నారు.ప్రస్తుత ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి,ఆందోళన, జీవనశైలి సంబంధిత వ్యాధుల నుంచి ఉపశమనం పొందేందుకు యోగా అత్యుత్తమ మార్గమని తెలిపారు. ప్రతిరోజూ కొద్దిసేపు యోగా సాధన చేయడం ద్వారా శారీరక దృఢత్వం,






మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని అన్నారు.
ఐక్యరాజ్యసమితి జూన్ 21ను అంతర్జాతీయ యోగ దినోత్సవంగా ప్రకటించడం ద్వారా యోగా విశ్వవ్యాప్త గుర్తింపు పొందిందని,నేడు ప్రపంచ దేశాలు భారతీయ యోగా సంప్రదాయాన్ని ఆదరిస్తుండటం ప్రతి భారతీయుడికి గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు."ఆరోగ్య తెలంగాణ,ఆరోగ్య భారత నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుంది. యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు సహా ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలి.ప్రతి ఇంటిలో యోగా సంస్కృతి పెంపొందితే ఆరోగ్య సమస్యలను గణనీయంగా తగ్గించవచ్చు" అని మంత్రి పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య, వైద్య & కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్. చోంగ్థు,ఐఏఎస్, జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, రాజేంద్రనగర్ ఆర్డీవో శ్రీధర్, శేరిలింగంపల్లి తహసీల్దార్,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. స్వర్ణకుమారి, వివిధ శాఖల అధికారులు, యోగా గురువులు, విద్యార్థులు, యువత, తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ప్రారంభమైన టీజీ20 లీగ్...

## హాజరైన విజయ్ దేవరకొండ




**హైదరాబాద్ ,(ప్రజావినికిడి):**
తెలంగాణ క్రీడారంగంలో కొత్త అధ్యాయానికి తెరలేచింది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న క్రికెట్ ప్రతిభను వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ సీఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీజీ20 (టీజీ20) లీగ్ ఘనంగా ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరిగిన ప్రారంభోత్సవ వేడుక అంబరాన్నంటింది. సినీ, రాజకీయ ప్రముఖుల సమక్షంలో ఈ లీగ్ అట్టహాసంగా మొదలైంది.ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా లీగ్ బ్రాండ్ అంబాసిడర్, ప్రముఖ సినీ నటుడు విజయ్ దేవరకొండ హాజరై సందడి చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ తన లైవ్ పర్ఫార్మెన్స్‌తో స్టేడియాన్ని హోరెత్తించారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ... హైదరాబాద్, తెలంగాణ నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఆటగాళ్లు చాలా తక్కువ మంది ఉన్నారని, వీవీఎస్ లక్ష్మణ్ తర్వాత ఆ స్థాయి ఖాళీ ఏర్పడిందని అన్నారు. ఈ టీజీ20 లీగ్ ద్వారా ఎంతో మంది యువ ప్రతిభావంతులు వెలుగులోకి వచ్చి, ఐపీఎల్, టీమిండియాకు ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షించారు. ఈ లీగ్‌లో భాగం కావడం చాలా సంతోషంగా ఉందని ఆయన తెలిపారు.ఈ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ఛాంపియన్స్ (ఈటీవీ భారత్) సహా పలు జట్లు పాల్గొంటున్నాయి. ప్రారంభోత్సవం అనంతరం లీగ్‌లో మ్యాచ్‌లు కూడా మొదలయ్యాయి. తెలంగాణలోని యువ క్రీడాకారులకు ఇదొక సువర్ణావకాశమని నిర్వాహకులు చెబుతున్నారు. అయితే, ఈ లీగ్ నిర్వహణపై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) నుంచి కొన్ని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నప్పటికీ, హెచ్‌సీఏ మాత్రం ఈ టోర్నీని విజయవంతంగా ముందుకు నడిపిస్తోంది.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీజీ20 లీగ్‌కు ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం ఉండి, అవకాశాలు రాని యువతకు ఇది ఒక గొప్ప వేదిక అని ఆయన ప్రశంసించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, రాష్ట్రంలో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని భట్టి వివరించారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి, వారిని ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.



# గుభాళించే గులాబీ అస్త్రం.. నిరుపేదల ప్రియ నేస్తం..

**నిత్యం ప్రజల మధ్యే "రవన్న" ప్రస్థానం..**
**కార్యకర్తల మనిషిగా రవి కాంతులు..**
**ముక్కుసూటితనం,నిబద్ధతే రవీందర్ యాదవ్ బలం**
**ఎన్ని విమర్శలు వచ్చినా "చిరునవ్వే రవన్న ఆయుధం"**
**ఉద్యమ స్ఫూర్తి నుంచి ప్రజా నాయకత్వం వరకు రవీందర్ యాదవ్ ప్రయాణం**
**లక్ష్యంగా చేసుకున్న కొద్దీ ప్రజలకు మరింత చేరువైన నాయకుడు**
**టార్గెట్ చేసిన కొద్దీ మరింత బలపడిన రాజకీయం..**
**ఇది షాద్ నగర్ బిఆర్ఎస్ నేత రవీందర్ యాదవ్ "రాజకీయ ప్రస్థానం"**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఉద్యమ సమయంలోనూ.. ఇటు పదేళ్ల పాలనలోనూ గుభాళించిన గులాబీ అస్త్రంగా.. షాద్ నగర్ నియోజకవర్గాన్ని తొమ్మిదిన్నర ఏళ్లపాటు ఏలిన అంజన్నకు కుడి భుజంగా.. నిరుపేదల ప్రజల ఆత్మీయ నేస్తంగా.. నిత్యం ప్రజా సేవలో తానే సమస్తంగా నిలిచి గెలిచిన నాయకుడు.. నిస్వార్థ సేవకుడుగా వై. రవీందర్ యాదవ్ (రవన్న) ప్రస్థానం వినూత్నం..రాజకీయాల్లో కొంతమంది నాయకులు పదవుల వల్ల గుర్తింపు పొందుతారు. మరికొందరు తమ వ్యక్తిత్వం, నిబద్ధత,ప్రజలతో ఉన్న అనుబంధం వల్ల ప్రత్యేక గుర్తింపు సంపాదిస్తారు. షాద్‌నగర్ రాజకీయాల్లో రవీందర్ యాదవ్ రెండో కోవకు చెందిన నాయకుడిగా తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో కేసీఆర్ కుటుంబం ఎప్పుడూ రాజకీయ ప్రత్యర్థుల లక్ష్యంగా నిలిచినట్లే, షాద్‌నగర్ రాజకీయాల్లో మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ కుటుంబం కూడా అనేక సందర్భాల్లో ప్రత్యర్థుల విమర్శలకు కేంద్ర బిందువుగా మారింది.అయితే కాలం గడిచే కొద్దీ ఒక విషయం స్పష్టమైంది. విమర్శలు పెరిగిన కొద్దీ వారి రాజకీయ ప్రస్థానం మరింత బలపడింది.
మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తొమ్మిదిన్నర సంవత్సరాల పదవీకాలంలో షాద్‌నగర్ అభివృద్ధికి వేల కోట్ల రూపాయల నిధులు సమకూర్చి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆ ప్రయాణంలో రవీందర్ యాదవ్ తండ్రికి రాజకీయంగా అండగా నిలవడమే కాకుండా పార్టీ కార్యకర్తలు, నాయకులు,ప్రజల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించారు. గ్రామీణ స్థాయి కార్యకర్త నుంచి పార్టీ సీనియర్ నాయకుడి వరకు అందరికీ అందుబాటులో ఉండటం రవీందర్ యాదవ్ ప్రత్యేకతగా చెప్పవచ్చు. రాజకీయాల్లో పదవి లేకపోయినా ప్రజల మధ్య ఉండటం, అవసరమైన సమయంలో అండగా నిలవడం, కార్యకర్తల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం ద్వారా ఆయన విశేష ఆదరణ పొందారు.





ఒక్కమాటలో చెప్పాలంటే నియోజకవర్గంలో తండ్రికి తగ్గ తనయుడుగా బిఆర్ఎస్ పార్టీకి రథ సారథిగా చక్రం తిప్పారు.తన తండ్రి రెండు పర్యాయలు షాద్ నగర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ రవీందర్ యాదవ్ మాత్రం సదాసీదాగానే తన రాజకీయ ప్రస్తానాన్నీ కొనసాగించారు. గులాబి కార్యకర్తల గుండెల్లో "రవన్న"గా నిలిచిపోయారు.

**ఎన్ని విమర్శలు వచ్చినా "చిరునవ్వే రవన్న ఆయుధం"**

**ముక్కుసూటితనం ఆయన బలం**

రవీందర్ యాదవ్ పేరు వినగానే గుర్తుకు వచ్చేది ఆయన ముక్కుసూటి స్వభావం. తప్పును తప్పు అని చెప్పే ధైర్యం, నిజాన్ని నిర్భయంగా వ్యక్తపరిచే నైజం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. రాజకీయాల్లో రాజీ పడకుండా తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పే నాయకుడిగా ఆయనకు పేరు ఉంది.అందుకే కొందరు రాజకీయ ప్రత్యర్థులు ఆయనను లక్ష్యంగా చేసుకున్నప్పటికీ, ప్రతి విమర్శను ఆయన మరింత బలంగా ఎదగడానికి అవకాశంగా మలుచుకున్నారు. రాజకీయంగా ఇబ్బందుల్లో ఉన్న సమయంలో అనేక మందికి ఆయన చేసిన సహకారం, అందించిన మద్దతు నేటికీ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగానే ఉంది.ఉద్యమ స్ఫూర్తితో ప్రారంభమైన ప్రస్థానం రవీందర్ యాదవ్ రాజకీయ ప్రయాణం ఒక్కసారిగా ప్రారంభమైనది కాదు.తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీని ప్రకటించిన ప్రారంభ దశ నుంచే ఆయన ఉద్యమ భావజాలంతో రాజకీయాల్లో అడుగుపెట్టారు. తెలంగాణ ఆకాంక్షను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేశారు.ఆ రోజు నుంచి నేటి వరకు రాజకీయంగా, ఆర్థికంగా, సంస్థాగతంగా పార్టీకి అండగా నిలుస్తూ వచ్చిన ఆయన ప్రయాణం అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంది. అయినప్పటికీ ఎక్కడా వెనక్కి తగ్గకుండా కార్యకర్తలే తన బలం,ప్రజలే తన ప్రేరణ అనే నమ్మకంతో ముందుకు సాగుతున్నారు.

**ప్రజల మధ్యే నాయకత్వం**

రవీందర్ యాదవ్ రాజకీయ జీవితంలో ప్రధాన బలం ప్రజలతో ఉన్న అనుబంధం. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, పార్టీ కార్యకర్తల సంక్షేమం వంటి అంశాల్లో ఆయన చూపుతున్న చొరవ ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. రాజకీయంగా ఎన్ని సవాళ్లు ఎదురైనా,ఎన్ని విమర్శలు వచ్చినా వాటిని అధిగమిస్తూ తనదైన శైలిలో ముందుకు సాగుతున్న నాయకుడిగా రవీందర్ యాదవ్ నిలిచారు.టార్గెట్ చేసిన కొద్దీ మరింత బలపడుతూ, కార్యకర్తల విశ్వాసాన్ని సొంతం చేసుకుంటూ ఆయన రాజకీయ ప్రస్థానం కొనసాగుతోంది..

# కాపుల తరఫున పోరాటం!

**బాధితులకు అండగా ఉందాం**

**సాయికృష్ణ కుటుంబానికి ఆర్థిక సాయం**

**ఆత్మీయ సమావేశంలో తీర్మానాలు**




**అమలాపురం/ద్రాక్షారామ, జూన్ 21(ప్రజావినికిడి):**
కూటమి ప్రభుత్వం కాపులపై దాష్టీకాలకు పాల్పడుతోందని, దీనిపై పోరాడాలని వైసీపీ కాపు నేతలు నిర్ణయించారు. ఆదివారం వెంకటాయపాలెంలోని ఒక కల్యాణ మండపంలో సుమారు నాలుగు గంటలపాటు వీరు చర్చలు జరిపారు. విజయవాడ కృష్ణలంకలో రౌడీ షీటర్ గాదె సాయికృష్ణ కేసును ప్రస్తావిస్తూ... రాష్ట్రంలో ఎక్కడైనా కాపులకు అన్యా యం జరిగితే... నేరుగా అక్కడికి వెళ్లి ధైర్యం చెప్పాలని తీర్మానించారు. దీనికోసం మూడు ప్రాంతాల్లో మూడు టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కాపు బాధితులకు క్లౌడ్ ఫండిం గ్ ద్వారా నిధులు సేకరించి ఆదుకోవాలని కూడా నిర్ణయించారు. భేటీకి హాజరైన నేతలంతా రూ.50వేలు తగ్గకుండా సేకరించి సాయికృష్ణ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలని తీర్మానించారు. కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభరెడ్డి కోలుకుని తమ పక్షాన తిరిగి పోరాడాలని ఆకాంక్షిస్తూ తీర్మానం చేశారు. విశాఖలో, తిరుపతిలోనూ ఇలాంటి సమావేశాలు పెట్టాలని తీర్మానించారు. "ఈ సమావేశంపై మీడియాలో విభిన్న కథనాలు వచ్చా యి. ఇది ఒక వ్యక్తి కోసమో, ఒక సంఘటనను ఖండించడానికో పెట్టింది కాదు" అని కన్నబాబు పేర్కొన్నారు.

# ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు.. పూర్తిగా దగ్ధం

**తిమ్మాపూర్:జూన్ 21 (ప్రజావినికిడి)::**
కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు సుమారు 40 మంది ప్రయాణికులతో బయల్దేరిన ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు ఆదివారం ఉదయం అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధ మైంది. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సు ఉద యం కరీంనగర్ బస్టాండ్ నుంచి హైదరాబాద్ కు ప్రయాణికులతో బయలు దేరింది. దాదాపు మూడు, నాలుగు కిలోమీటర్ల మేర ప్రయాణం పూర్తి చేసి అలుగునూర్ శివారులోని కాకతీయ కాలువ వద్దకు రాగానే బస్సులో అకస్మాత్తుగా దట్ట మైన పొగ, మంటలు రావడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమై ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ బస్సును రోడ్డు పక్క న ఆపి డోర్లు,ఎమర్జెన్సీగేట్లు తెరిచి ప్రయాణికులందరినీ సురక్షితంగా బయట కుదించాడు. అనంతరం బస్సులోని అగ్నిమాపక పరికరాలతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేక పోగా, మంటలు



వేగంగా వ్యాపించి నిమిషాల్లోనే బస్సు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే బస్సులో అకస్మాత్తు గా మంటలు ఎలా వ్యాపించాయో తెలియాల్సి ఉంది.

# బొగ్గు మాయం కాలేదు.. ఆరోపణలు నిరాధారం

**: సింగరేణి యాజమాన్యం**

**రూ.1,600 కోట్ల బొగ్గు కుంభకోణం ఆరోపణలను ఖండించిన సింగరేణి**

**బొగ్గు ఉత్పత్తి, రవాణాలో పూర్తి పారదర్శకత ఉందని స్పష్టం**

**40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందన్న వార్తల్లో నిజం లేదని ప్రకటన**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖతో తెరపైకి వచ్చిన బొగ్గు గల్లంతు ఆరోపణలు**


**అత్యాధునిక టెక్నాలజీతో నిరంతరం పర్యవేక్షణ జరుగుతోందని వివరణ**




**సింగరేణి జూన్ 21(ప్రజావినికిడి):**
సింగరేణిలో రూ.1,600 కోట్ల విలువైన భారీ బొగ్గు కుంభకోణం జరిగిందంటూ వస్తున్న ఆరోపణలను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్ సీసీఎల్) తీవ్రంగా ఖండించింది. సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. బొగ్గు ఉత్పత్తి, నిల్వ, రవాణా, విక్రయాల వరకు ప్రతి దశ పూర్తి పారదర్శకంగా, అత్యాధునిక సాంకేతిక వ్యవస్థల పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపింది.
సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు గల్లంతైందని, దీనిపై తక్షణమే విచారణ జరపాలని కోరుతూ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఇటీవలే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఈ లేఖతో పాటు, ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేయడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోనే సింగరేణి యాజమాన్యం వివరణ ఇచ్చింది.గనుల్లో బొగ్గు వెలికితీసిన క్షణం నుంచి వినియోగదారుడికి చేరే వరకు ప్రతి అంశం డిజిటల్‌గా నమోదవుతుందని కంపెనీ వివరించింది. సుమారు 85 శాతం బొగ్గు రైళ్ల ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గంలో రవాణా అవుతుందని, శాప్ (ఎస్ఏపీ) ఆధారిత ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ ద్వారా బొగ్గు కేటాయింపులు జరుగుతాయని పేర్కొంది. రోడ్డు మార్గంలో వెళ్లే ప్రతి వాహనాన్ని ఎలక్ట్రానిక్ వే-బ్రిడ్జిల వద్ద తూకం వేస్తామని, ఆర్ఎఫ్ఐడీ ఆధారిత బూమ్ బారియర్లు, జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా వాహనాల కదలికలను పర్యవేక్షిస్తామని అధికారులు తెలిపారు. సీసీటీవీ కెమెరాలు, ఆర్ఎఫ్ఐడీ వ్యవస్థలు, చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌ల వంటి బహుళస్థాయి భద్రతా వ్యవస్థ పటిష్టంగా ఉందని యాజమాన్యం స్పష్టం చేసింది. ఇంతటి కట్టుదిట్టమైన భద్రత మధ్య బొగ్గు దొంగతనం లేదా మాయం కావడానికి ఆస్కారమే లేదని, ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని కొట్టిపారేసింది. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి 51:49 వాటాలు ఉన్న సింగరేణి సంస్థలో ఈ ఆరోపణలు కలకలం రేపాయి.

# జులైలో ఆకాశంలో అద్భుతాల జాతర.. గ్రహాల కలయిక నుంచి ఉల్కాపాతం వరకు!

**జూన్ 21(ప్రజావినికిడి):**
ఖగోళ ప్రియులకు, ఆకాశాన్ని ఆసక్తిగా గమనించే వారికి 2026 జులై నెల ఒక కనుల పండుగ తీసుకురాబోతోంది. గ్రహాల అరుదైన కలయికల నుంచి ఉల్కాపాతాల వరకు అనేక అద్భుత దృశ్యాలు ఈ నెలలో ఆవిష్కృతం కానున్నాయి. సాధారణ కంటితో చూడగలిగేవి కొన్ని అయితే, బైనాక్యులర్ల సహాయంతో మరికొన్నింటిని వీక్షించవచ్చు. ఈ నెలలో జరగబోయే ముఖ్యమైన ఖగోళ విశేషాలు వరుసగా ఉన్నాయి, వీటిని వీక్షించడం ద్వారా మరపురాని అనుభూతిని పొందవచ్చు.



**అంగారకుడు, యురేనస్ అరుదైన కలయిక**

ఈ నెల 3వ తేదీన తెల్లవారుజామున తూర్పు ఆకాశంలో అంగారకుడు (మార్స్), యురేనస్ గ్రహాలు చాలా దగ్గరగా కనిపించి కనువిందు చేస్తాయి. ఇది చాలా అరుదైన గ్రహాల కలయిక. ప్రకాశవంతమైన అంగారకుడిని సాధారణ కంటితో చూడగలిగినప్పటికీ, యురేనస్‌ను స్పష్టంగా చూడాలంటే బైనాక్యులర్లు లేదా చిన్న టెలిస్కోప్ అవసరం. స్పష్టమైన ఆకాశం ఉంటే ప్రపంచంలోని అనేక ప్రాంతాల నుంచి ఈ దృశ్యాన్ని వీక్షించవచ్చు.

**సూర్యుడికి అత్యంత దూరంగా భూమి**

జులై 6న భూమి సూర్యుడి నుంచి తన కక్ష్యలో అత్యంత దూరంలోకి వెళ్తుంది. దీనిని ఖగోళ పరిభాషలో 'అపహేలి' అంటారు. ఆ రోజు భూమికి, సూర్యుడికి మధ్య దూరం సుమారు 152.1 మిలియన్ కిలోమీటర్లు ఉంటుంది. ఇది కంటికి కనిపించే అద్భుతమేమీ కానప్పటికీ, భూమిపై రుతువులు ఏర్పడటానికి సూర్యుడికి, భూమికి మధ్య దూరం కారణం కాదని, భూమి అక్షం వంపు వల్లే రుతువులు ఏర్పడతాయనే శాస్త్రీయ వాస్తవాన్ని గుర్తుచేసే ఒక ముఖ్యమైన సందర్భం ఇది.

**మాన్‌హాటన్‌హెంజ్, అమావాస్య**

అమెరికాలోని న్యూయార్క్ నగరంలో జులై 11-12 తేదీల్లో 'మాన్‌హాటన్‌హెంజ్' అనే అద్భుత దృశ్యం ఆవిష్కృతం కానుంది. సూర్యాస్తమయ సమయంలో సూర్యుడు నగరం యొక్క తూర్పు-పడమర వీధులకు సరిగ్గా మధ్యలో ప్రకాశిస్తూ, ఆకాశహర్మ్యాల మధ్య అగ్నిగోళంలా కనిపిస్తాడు. ఇక జులై 14న అమావాస్య వస్తుంది. ఆ రోజు ఆకాశం అత్యంత చీకటిగా ఉంటుంది కాబట్టి, పాలపుంత కేంద్ర భాగాన్ని, ఇతర నక్షత్ర మండలాలు, సుదూర ఖగోళ వస్తువులను వీక్షించడానికి ఇది అనువైన సమయం.

**చంద్రుడు-శుక్రుడు, బక్ మూన్**

జులై 17న సూర్యాస్తమయం తర్వాత పశ్చిమ వాయువ్య దిశలో సన్నని చంద్రవంక ప్రకాశవంతమైన శుక్ర గ్రహానికి (వీనస్) చాలా దగ్గరగా కనిపిస్తుంది. ఇది సాధారణ కంటితో చూడగలిగే ఎంతో అందమైన దృశ్యం. ఆ తర్వాత, జులై 29న పౌర్ణమి వస్తుంది. దీనిని 'బక్ మూన్' అని పిలుస్తారు. ఈ సమయంలో మగ జింకలకు కొత్త కొమ్ములు పెరుగుతాయి కాబట్టి ఈ పేరు వచ్చింది.

**డెల్టా అక్వారిడ్స్ ఉల్కాపాతం**

ఈ నెలాఖరున, జులై 30-31 తేదీలలో, సదరన్ డెల్టా అక్వారిడ్స్ ఉల్కాపాతం గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. ఇది వేసవిలో నమ్మకంగా కనిపించే ఉల్కాపాతాలలో ఒకటి. అర్ధరాత్రి దాటిన తర్వాత తెల్లవారుజాము వరకు (సుమారు రాత్రి 11 గంటల నుంచి ఉదయం 4-5 గంటల మధ్య) గంటకు డజన్ల కొద్దీ ఉల్కలు ఆకాశంలో మెరిసి మాయమవుతాయి.

# రామాలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చెయ్యాలని మంత్రిని కలిసిన కొత్తపేట సర్పంచ్.



**బయ్యారం/,జూన్ 21.(ప్రజావినికిడి):**
బయ్యారం మండలం కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి గంధంపల్లి గ్రామంలోని పురాతన శ్రీ కోదండరామాలయ పునర్నిర్మాణనికి రూ.50 లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సిఫారసు లేఖను మంత్రికీ అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మంత్రితో మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం గ్రామ ప్రజల భక్తి విశ్వాసాలకు కేంద్ర బిందువుగా నిలుస్తోందని,ప్రస్తుతం ఆలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణం అత్యవసరంగా మారిందని,భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కోసం నిధులు అవసరమని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి కొండా సురేఖ సానుకూలంగా స్పందిస్తూ గంధంపల్లి శ్రీ కోదండరామాలయం అభివృద్ధి కోసం నిధుల మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు.ఆలయ పునర్నిర్మాణానికి సిఫారసు లేఖ అందించిన ఎమ్మెల్యే కోరం కనకయ్యకీ సర్పంచ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చిన మంత్రి కొండా సురేఖకి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కొండా యువసేన రాష్ట్ర అధ్యక్షులు అనిల్,వార్డు సభ్యులు భూక్య శీను తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సభ, రైతు మేళాపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం

**చింతకాని,/ జూన్ 21 (ప్రజావినికిడి):**
చింతకాని మండలంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న రైతు మేళా, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధికారులను ఆదేశించారు. రైతు మేళాను అన్నదాతలు సద్వినియోగం చేసుకుని ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రైతు మేళా, సీఎం పర్యటన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మధిర నియోజకవర్గ పరిధిలోని చింతకాని మండలంలో నిర్వహించే రైతు మేళాలో ఈ నెల 30న ముఖ్యమంత్రి పాల్గొనే సభను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.
రైతు మేళాలో 150 స్టాల్స్ ఏర్పాటు చేసి వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య రంగాల్లోని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు పరిచయం చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన సాంకేతికతను రైతులు అందిపుచ్చుకుని ఉత్పాదకతను పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతు మేళాకు హాజరయ్యే శాస్త్రవేత్తలకు అవసరమైన బస, రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.సమావేశంలో డీఆర్‌డీవో శ్రీరామ్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. పురందర్, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం, పీడీ మెప్మా తదితరులు పాల్గొన్నారు.

# యూరియా బుకింగ్ యాప్‌కు రైతుల ఆదరణ

## తొలి రోజే 2,362 బుకింగ్స్ నమోదు

**ధర్మసాగర్/హనుమకొండ(ప్రజావినికిడి)::**
ఖరీఫ్-2026 సీజన్‌లో రైతులకు యూరియా సరఫరాను పారదర్శకంగా, సులభతరం చేసే లక్ష్యంతో వ్యవసాయ శాఖ ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్‌కు ధర్మసాగర్ మండలంలో తొలి రోజే విశేష స్పందన లభించింది. రైతులు పెద్ద సంఖ్యలో యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవడంతో కొత్త



విధానంపై ఆసక్తి వ్యక్తమవుతోంది.మండల వ్యవసాయ అధికారి రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం, యాప్ ప్రారంభమైన మొదటి రోజే 2,362 బుకింగ్స్ నమోదు కాగా, మొత్తం 7,654 యూరియా బ్యాగులు బుక్ అయ్యాయి. బుక్ అయిన వాటిలో 2,765 బ్యాగులను రైతులకు విక్రయించగా, ప్రస్తుతం 1,262 బ్యాగులు అందుబాటులో ఉన్నాయి.యూరియా పంపిణీలో అక్రమాలకు తావులేకుండా రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తోందని ఆయన తెలిపారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా ముందస్తుగా యాప్‌లో బుకింగ్ చేసుకోవడం వల్ల ఎరువుల కోసం వేచి ఉండాల్సిన అవసరం తగ్గుతుందన్నారు.మండలంలోని ఎరువుల నిల్వలు, సరఫరా పరిస్థితులను వ్యవసాయ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని రాజేష్ పేర్కొన్నారు. రైతులు యూరియా బుకింగ్ యాప్‌ను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు."రైతులకు సకాలంలో, పారదర్శకంగా యూరియా అందించడమే లక్ష్యం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అవసరమైన మేరకు నిల్వలు అందుబాటులో ఉంచుతున్నాం అని మండల వ్యవసాయ అధికారి రాజేష్ తెలిపారు.

# ఘనంగా ఉప్పుల మైసమ్మ ఆలయ భూమి పూజ





**దామరచర్ల/ జూన్ 21(ప్రజావినికిడి):**మండల పరిధిలోని రాళ్లవాగు తండ గ్రామంలో ఉప్పుల మైసమ్మ తల్లి (బోట్కు భవాని) గుడి నిర్మాణ పనులకు శుక్రవారం భూమి పూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధీరావత్ శంకర్ నాయక్, ఉపసర్పంచ్ నాగమణి కిషన్, వార్డు సభ్యులు కోట నాయక్, మంగ కిషన్ నాయక్, శివాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధీరావత్ మోహన్ నాయక్ పాల్గొని మాట్లాడారు.
గ్రామ ఆధ్యాత్మిక వాతావరణానికి, అభివృద్ధికి ఈ ఆలయ నిర్మాణం ఎంతో దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు. భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేస్తామని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొండ్రపోల్ మాజీ సర్పంచ్ మాన్య నాయక్, మాజీ ఉపసర్పంచ్ నాగు నాయక్, ధీరావత్ వంశీ నాయక్, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉదయాన్నే నిద్రలేస్తే ఆరోగ్యానికి ఎన్నో లాభాలు



రాత్రి త్వరగా నిద్రపోయి, ఉదయాన్నే త్వరగా లేవడం మంచి అలవాటు అని పెద్దలు చెబుతుంటారు. ఇలా చేయడం వల్ల రోజువారీ పనులను ప్రశాంతంగా పూర్తి చేసుకోవచ్చు. అంతేకాకుండా శారీరక, మానసిక ఆరోగ్యానికి కూడా అనేక ప్రయోజనాలు కలుగుతాయి. ఈ రోజుల్లో చాలా మంది ఆలస్యంగా నిద్రపోయి, ఆలస్యంగా లేస్తున్నారు. ఈ అలవాటు బద్ధకాన్ని పెంచడమే కాకుండా కొన్ని ఆరోగ్య సమస్యలకు కూడా దారితీస్తుంది. జీవనశైలిలో చిన్న మార్పు చేసి, త్వరగా నిద్రపోయి త్వరగా లేవడం అలవాటు చేసుకుంటే ఆరోగ్యం మెరుగుపడుతుంది.

**ఒత్తిడి తగ్గుతుంది**

ఉదయం ఆలస్యంగా లేస్తే పనులన్నీ తొందరపాటుగా చేయాల్సి వస్తుంది. దీంతో ఒత్తిడి పెరుగుతుంది. కానీ త్వరగా నిద్రలేస్తే పనులను ప్రశాంతంగా, సమయానికి పూర్తి చేసుకోవచ్చు. ఇది మనసును తాజాగా ఉంచి ఒతిడిని తగ్గిస్తుంది.

**బరువు తగ్గడంలో సహాయం**

ఉదయాన్నే లేవడం వల్ల వ్యాయామానికి సమయం దొరుకుతుంది. ఉదయం చేసే వ్యాయామం శరీరానికి శక్తిని అందించడంతో పాటు బరువు తగ్గడంలో కూడా సహాయ పడుతుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో కూడా ఇది ఉపయోగ పడుతుంది.

**ఊపిరితిత్తులు ఆరోగ్యంగా**

ఉదయం సమయంలో గాలి స్వచ్ఛంగా ఉంటుంది. ఆ సమయంలో వాకింగ్ లేదా వ్యాయామం చేస్తూ లోతుగా శ్వాస తీసుకోవడం ఊపిరితిత్తులకు మంచిది. దీంతో శ్వాసకోశ ఆరోగ్యం మెరుగుపడుతుంది.

**నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది**

ఉదయాన్నే త్వరగా లేచే వారు సాధారణంగా రాత్రి కూడా త్వరగా నిద్రపోతారు. దీంతో వారి నిద్ర సమయానికి పూర్తవడంతో పాటు నిద్ర నాణ్యత కూడా మెరుగుపడుతుంది.

**సానుకూల ఆలోచనలు**

ఉదయాన్నే లేచి ధ్యానం, నడక లేదా ప్రశాంతంగా గడపడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడి సానుకూల ఆలోచనలు పెరుగుతాయి. ఉదయాన్నే త్వరగా నిద్రలేవడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉండటమే కాకుండా మనసుకూడా ఉల్లాసంగా ఉంటుందిఉ

# ఏసీలో ఎక్కువసేపు ఉంటే ఎముకలు బలహీనమవుతాయా

ఇటీవల కాలంలో ఇళ్లు, కార్యాలయాలు, వాహనాల్లో ఎయిర్ కండిషనర్ (ఏసీ) వినియోగం బాగా పెరిగింది. అయితే, ఎక్కువ సమయం ఏసీ గదుల్లో గడిపితే ఎముకలు బలహీనపడతాయా కీళ్ల నొప్పులు లేదా ఆర్థరైటిస్ వచ్చే ప్రమాదం ఉందా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఏసీ నుంచి వచ్చే చల్లని గాలి ఎముకలను నేరుగా బలహీనపరచదు. అయితే, రోజంతా ఏసీ గదుల్లోనే ఉండడం వల్ల కొన్ని పరోక్ష ప్రభావాలు ఎముకల ఆరోగ్యంపై పడే అవకాశం ఉంది.

**ఎముకలపై ఏసీ ప్రభావం ఎలా ఉంటుంది**

ఎముకల దృఢత్వం ప్రధానంగా కాల్షియం, విటమిన్-డి, సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా చేసే వ్యాయామంపై ఆధారపడి ఉంటుంది. ఎక్కువ సమయం ఇంట్లో లేదా కార్యాలయంలో ఏసీలో గడిపేవారికి సూర్యరశ్మి తక్కువగా తగులుతుంది. దీంతో శరీరంలో విటమిన్-డి లోపం ఏర్పడే అవకాశం ఉంటుంది.

విటమిన్-డి ఎముకలకు అవసరమైన కాల్షియంను శరీరం గ్రహించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. దీర్ఘకాలం విటమిన్-డి లోపం ఉంటే ఎముకలు బలహీనపడటంతో పాటు ఆస్టియోపొరోసిస్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది.



**కీళ్ల నొప్పులు పెరుగుతాయా**

ఏసీ వాడకం వల్ల నేరుగా కీళ్లవాతం (ఆర్థరైటిస్) రాదు. అయితే ఇప్పటికే కీళ్ల నొప్పులు, ఆస్టియో ఆర్థరైటిస్ వంటి సమస్యలతో బాధపడుతున్నవారికి చల్లటి వాతావరణం కారణంగా నొప్పి, బిగుతు ఎక్కువగా అనిపించవచ్చు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

రోజూ కనీసం 10 నుంచి 15 నిమిషాల పాటు సూర్యరశ్మిలో గడపండి. కాల్షియం, విటమిన్-డి అధికంగా ఉండే ఆహారాలను తీసుకోండి. పాలు, పెరుగు, జున్ను వంటి పాల ఉత్ప త్తులను ఆహారంలో చేర్చుకోండి. రోజూ నడక లేదా తేలికపాటి వ్యాయామం చేయండి.

**ఏసీ ఉష్ణోగ్రతను 24 డిగ్రీల సెల్సియస్ వద్ద ఉంచడం మంచిది.**

ఏసీ వాడటం వల్ల ఎముకలు నేరుగా బలహీనపడవు. అయితే సూర్యరశ్మి లోపం, శారీరక శ్రమ తగ్గడం వంటి కారణాలు ఎముకల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే సరైన ఆహారం, వ్యాయామం, తగినంత సూర్యరశ్మి తీసుకోవడం చాలా ముఖ్యం.

# రోజూ 5 నిమిషాలు ఈ వ్యాయామం చేస్తే ఫిట్‌గా ఉండొచ్చు

ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. అయితే ఉద్యోగం, పనుల ఒత్తిడి, తీరికలేని జీవనశైలి కారణంగా చాలా మందికి వ్యాయామం చేయడానికి సమయం దొరకదు. మరికొందరికి జిమ్‌లో గంటల తరబడి కష్టపడటం ఇష్టం ఉండదు. అలాంటి వారికి కేవలం 5 నిమిషాల్లో పూర్తయ్యే హై ఇంటెన్సిటీ ఇంటర్వెల్ ట్రైనింగ్ మంచి ఎంపికగా నిపుణులు సూచిస్తున్నారు. ఈ వ్యాయామానికి ఎలాంటి పరికరాలు అవసరం లేదు. ప్రతి వ్యాయామాన్ని 45 సెకన్లు చేయాలి. తర్వాత 15 సెకన్లు విశ్రాంతి తీసుకుని తదుపరి వ్యాయామానికి వెళ్లాలి.
మఖానా ఛాట్.. తయారు చేసుకోండిలా..



**జంపింగ్ జాక్స్**

మొదట 45 సెకన్ల పాటు జంపింగ్ జాక్స్ చేయాలి. ఇది శరీరాన్ని వార్మప్ చేయడంలో సహాయపడుతుంది. గుండె, ఊపిరితిత్తులు, కండరాలు చురుకుగా పనిచేసేలా చేస్తుంది. శరీరమంతా కదలికలోకి రావడానికి ఇది మంచి వ్యాయామం.

**స్క్వాట్స్**

తర్వాత 45 సెకన్ల పాటు స్క్వాట్స్ చేయాలి. ఇవి తొడలు, తుంటి కండరాలను బలపరుస్తాయి. అలాగే పొట్ట, నడుము భాగంలోని కండరాల శక్తిని పెంచుతాయి. శరీర సమతుల్యత, సహనాన్ని మెరుగుపరుస్తాయి.

**పుష్-అప్స్**

45 సెకన్ల పాటు పుష్-అప్స్ చేయాలి. ఇవి ఛాతీ, భుజాలు, చేతులు, కోర్ కండరాలను బలపరుస్తాయి. శరీర బరువునే ఉపయోగించి చేసే ఈ వ్యాయామం కండరాల పెరుగుదలకు సహాయపడుతుంది.

**మౌంటైన్ క్లైంబర్స్**

పొట్ట కొవ్వు తగ్గించడంలో, శరీరాన్ని చురుకుగా ఉంచడంలో మౌంటెన్ క్లైంబర్స్ ఉపయోగపడతాయి. 45 సెకన్ల పాటు ఈ వ్యాయామం చేస్తే గుండె వేగం పెరిగి క్యాలరీలు ఎక్కువగా ఖర్చవుతాయి.


**ప్లాంక్**

చివరిగా 45 సెకన్ల పాటు ప్లాంక్ చేయాలి. ఇది పొట్ట, నడుము, భుజాల కండరాలను బలపరుస్తుంది. శరీర స్థిరత్వాన్ని పెంచి, సరైన భంగిమను కాపాడటానికి సహాయ పడుతుంది.

**ప్రయోజనాలు**

కేవలం 5 నిమిషాల పాటు ఈ వ్యాయామాలు చేసినా శరీరంలోని ప్రధాన కండర సమూహాలు చురుకుగా పనిచేస్తాయి. రోజువారీ శక్తి స్థాయిలు పెరుగుతాయి. శారీరక దృఢత్వం మెరుగుపడి, ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడుతుంది. కాబట్టి సమయం తక్కువగా ఉన్న వారు కూడా రోజూ ఈ 5 నిమిషాల వ్యాయామాన్ని అలవాటు చేసుకోవచ్చు.

# నీరు తక్కువగా తాగితే కిడ్నీపై ఒత్తిడి పడుతుందా



శరీరానికి సరిపడా నీరు తాగడం ఆరోగ్యానికి చాలా అవసరం. ఎందుకంటే నీరు శరీరంలోని అన్ని అవయవాల పనితీరును సక్రమంగా నిర్వహించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా జీర్ణక్రియ మెరుగు పడటం, శరీర ఉష్ణోగ్రత నియంత్రణ, వ్యర్థ పదార్థాలను బయటకు పంపడం, మూత్ర పిండాల ఆరోగ్యాన్ని కాపాడడంలో నీరు ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. తగినంత నీరు తాగకపోతే మూత్రపిండాల పనితీరు ప్రభావితం అవుతుంది. అలాగే అనేక ఆరోగ్య సమస్యలు రావచ్చని నిపుణులు చెబుతున్నారుఆరోగ్య నిపుణులు తెలిపిన సమాచారం ప్రకారం.. నీరు తక్కువగా తాగితే మూత్రంలో బ్యాక్టీరియా పేరుకుపోయే అవకాశం ఉంటుంది. ఇది మూత్ర నాళాల ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. మూత్ర మార్గం ద్వారా హానికరమైన బ్యాక్టీరియాను బయటకు పంపేందుకు నీరు చాలా అవసరం. నీరు తక్కువగా తాగడం వల్ల మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే అవకాశం కూడా పెరుగుతుంది.

శరీరం డీహైడ్రేషన్‌కు గురైతే జీర్ణరసాల ఉత్పత్తి తగ్గుతుంది. దీని వల్ల గ్యాస్ట్రిటిస్, అల్సర్ వంటి సమస్యలు రావచ్చు. అలాగే మలబద్ధకం సమస్య కూడా తలెత్తవచ్చు. అంతే కాకుండా చర్మ సమస్యలు కూడా రావచ్చు. తామర, సోరియాసిస్ వంటి సమస్యలతో పాటు చర్మం పొడిబారడం, దురద వంటి సమస్యలు కనిపిస్తాయి. నీటి కొరత మెదడు పనితీరుపై కూడా ప్రభావం చూపుతుంది. మెదడుకు రక్తప్రసరణ, ఆక్సిజన్ సరఫరా తగ్గడంతో తలనొప్పి రావచ్చు. అలాగే నోటిలో బ్యాక్టీరియా పెరిగి నోటి దుర్వాసన సమస్య కూడా ఎక్కువవుతుంది.

# మఖానా ఛాట్ తయారు చేసుకోండిలా



**కావలసిన పదార్థాలు:** మఖానా రెండు కప్పులు, నెయ్యి స్పూను, ఛాట్ మసాల అర స్పూను, ఉప్పు పావు స్పూను, వేయించిన జీలకర్ర అర స్పూను, పచ్చి మిర్చి ముక్కలు స్పూను, టమాటా, కీరా ముక్కలు అర కప్పు, దానిమ్మ గింజలు రెండు స్పూన్లు, నిమ్మరసం స్పూను, కొత్తిమీర తరుగు స్పూను, వేయించిన పల్లీలు స్పూను.


**తయారుచేసే విధానం:** ఓ పాన్‌లో కాస్త నెయ్యి వేసి మఖానాను అయిదు నిమిషాల పాటు కరకరలాడేలా వేయించి పెట్టుకోవాలి. ఓ కప్పులో చాట్ మసాలా, ఉప్పు, జీలకర్ర పొడి, నిమ్మరసం కలుపుకోవాలి. ఓ పెద్ద కప్పులో మఖానా, టమాటా, కీరా ముక్కలు, దానిమ్మ గింజలు, పల్లీలు, ఛాట్ మసాలా మిశ్రమం జతచేసి మొత్తం కలిపి, పైన కొత్తిమీర తరుగు వేస్తే మఖానా ఛాట్ సిద్ధం.

## ఆలుగడ్డలను తింటే మధుమేహం వస్తుందా
## సైంటిస్టుల అధ్యయనంలో ఏం తేలింది

ఆలుగడ్డల గురించి ఆరోగ్య చర్చలు ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్నాయి. కొందరు వీటిని పొటాషియం, పీచు, విటమిన్లకు మంచి వనరుగా ప్రశంసిస్తే, మరికొందరు అధిక పిండి పదార్థాలు, గ్లైసెమిక్ ఇండెక్స్ కారణంగా ఆరోగ్యానికి హానికరమని భావిస్తారు. అయితే తాజాగా వెలువడిన ఒక దీర్ఘకాలిక అధ్యయనం ఆలుగడ్డల కంటే వాటిని వండే విధానమే ఆరోగ్య ప్రమాదాలకు ప్రధాన కారణమని వెల్లడించింది. దాదాపు 37 సంవత్సరాల పాటు 2 లక్షలకు పైగా మందిపై నిర్వహించిన ఈ పరిశోధనలో ఫ్రెంచ్ ఫ్రైస్‌ను తరచూ తినేవారిలో టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదం గణనీయంగా పెరుగుతున్నట్లు గుర్తించారు. అదే సమయంలో ఉడికించిన, కాల్చిన లేదా మెత్తగా చేసిన ఆలుగడ్డలు మాత్రం మధుమేహ ప్రమాదాన్ని పెంచలేదని అధ్యయనం తేల్చింది. 1984 నుంచి 2021 వరకు అమెరికాలో నిర్వహించిన మూడు ప్రధాన పరిశోధనల డేటాను శాస్త్రవేత్తలు విశ్లేషించారు. అధ్యయనం ప్రారంభ సమయంలో పాల్గొన్న వారిలో మధుమేహం, గుండెజబ్బులు లేదా క్యాన్సర్ లేవు. ప్రతి నాలుగేళ్లకు ఒకసారి వారి ఆహారపు అలవాట్లపై సమగ్ర సమాచారం సేకరించారు.ఆలుగడ్డలను అలా తింటేనే అనారోగ్యకరం..పరిశోధన కాలంలో మొత్తం 22,299 మందికి టైప్-2 మధుమేహం నిర్ధారణ అయింది. వారానికి మూడు సార్లు ఆలుగడ్డలు తినేవారిలో మధుమేహం వచ్చే ప్రమాదం స్వల్పంగా 5 శాతం పెరిగినట్లు కనిపించింది. అయితే వంట విధానాన్ని బట్టి పరిశీలించగా మరింత స్పష్టమైన తేడాలు బయటపడ్డాయి. వారానికి మూడు సార్లు ఫ్రెంచ్ ఫ్రైస్ తినేవారిలో టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదం 20 శాతం ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనం వెల్లడించింది. మరోవైపు అదే పరిమాణంలో ఉడికించిన, కాల్చిన లేదా మెత్తగా చేసిన ఆలుగడ్డలను తీసుకున్న వారిలో మధుమేహ ప్రమాదం పెరిగినట్లు ఎలాంటి గణాంక ఆధారాలు



## ఫాదర్స్ డే స్పెషల్ నాన్న నుంచి నేర్చుకోవాల్సిన 7 జీవిత పాఠాలు



ఎవరెంత మందిని హీరోలుగా ఆరాధించినా, అందరి తొలి హీరో నాన్నే నాన్న లాగానే చొక్కా తొడగకుండా.. కాదు కాదు నాన్న చొక్కా తొడక్కుండా, నాన్నలాగే తల దువ్వకుండా, నాన్న చెప్పుల్లో కాళ్లు పెట్టి నడవకుండా ఎవరి బాల్యమూ పూర్తవదు. ఖరీదైన వాచీలెన్ని పెట్టినా తొలిగా చుట్టుకున్న వదులైన నాన్న గడియారం పెట్టుకున్నప్పటి ఆనందాన్ని ఇవ్వలేవు. నాన్న అడుగుజాడలే జీవిత ప్రయాణానికి దిక్సూచి. నాన్న చిటికెన వేలు పట్టుకుని బజారుకు వెళ్లినప్పుడు అడిగింది ఏదైనా క్షణాల్లో చేతికందేది అప్పుడు నాన్న ఒక సూపర్ మ్యాన్ నాన్న అడుగుజాడల్లో బుడి బుడి అడుగులు వేస్తూ మొదలైన ప్రయాణం వడివడిగా సాగిపోయేప్పుడు కూడా నాన్నే రోల్ మోడల్! అమ్మానాన్న లయ్యాక కూడా నాన్న నుంచి నేర్చుకుంటే పెద్దయ్యాకా జీవితం బాల్యమంత ఆనందంగా సాగి పోతుంది. వేలుపట్టి నడిపించిన నాన్నే వెన్ను తట్టి ప్రోత్సహిస్తున్నంత ధైర్యం వస్తుంది.

**నిబద్ధతే బలం**

గుండె ధైర్యమే నాన్న బలం. పని ఒత్తిడి ఎంత ఉన్నా, ఆఫీసు నుంచి ఇంటికి వచ్చిన తర్వాత అలసిపోయానని విశ్రాంతి కోరడు. పిల్లల కోసం ఇంటి కోసం బరువు మోయడానికే సిద్ధపడతాడు. కష్టాలకు కుంగిపోకుండా ఇంట్లో అందరికీ ప్రేమను పంచడమే నాన్న బాధ్యతగా స్వీకరిస్తాడు. నిబద్ధతకు నాన్నే కొలమానం. పనిలో నిబద్ధతను, నాయకత్వంలో సమర్ధతను నాన్న నుంచే నేర్చుకోవాలి. మాటపై నిలబడటం, ఎంచుకున్న పనిని బాధ్యతగా నిర్వర్తించడం నాయకత్వ లక్షణాలు.నాయకత్వానికి తొలి పాఠం, తొలి గురువు నాన్నే!

## వాయు కాలుష్యం మీ చర్మాన్ని దెబ్బతీస్తోందా నేచురల్ చిట్కాలతో

# చర్మంపై మెరుపును తిరిగి పొందడం ఎలా

నగరాల్లో వాయు కాలుష్యం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇండస్ట్రీస్ నుంచి వచ్చే పొగ, వాహనాల నుంచి వచ్చే పొగ, చెత్త చెదారం కాల్చడం వల్ల వచ్చే పొగ్గ, దుమ్ముధూళితో సిటీ నిండిపోతుంది. ప్రస్తుతం హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో పలు ప్రాంతాల్లో యావరేజ్‌గా పీఎం 10 పరిమాణం క్యూబిక్ మీటర్‌కు 180 నుంచి 200 మైక్రోగ్రామ్స్ నమోదవుతుండటం ఆందోళన కరిగించే విషయం ఇది. వాయు కాలుష్యంతో ఊపిరితిత్తుల సమస్యలు, శ్వాసకోశ సమస్యలు, క్యాన్సర్, రక్తనాళ సంబంధిత సమస్యల ముప్పు పెరుగుతుంది.ఎయిర్ పొల్యూషన్ కేవలం అనారోగ్య సమ స్యలే కాదు, చర్మానికీ హాని చేస్తాయి. చర్మం కాంతిహీనంగా మారుతుంది. నల్లటి మచ్చలు, అన్‌ఇవెన్ టోన్ వంటి సమస్యలు ఎదురవుతాయని అధ్యయనం పేర్కొంది. ఈ నేపథ్యంలో వాయు కాలుష్యం కారణంగా ఎలాంటి చర్మ సమస్యలు ఎదురవుతాయి, కాలుష్యం నుంచి మన చర్మాన్ని ఎలా రక్షించుకోవాలో ఈ స్టోరీలో తెలుసుకుందాం..

**చర్మానికి ఎంతో హాని చేస్తుంది**

వాయు కాలుష్యం వల్ల గాలిలో పీ2.5, ాపీ10 వంటి అతి సూక్ష్మమైన కణాలు, ధూళి, పొగ, బ్యాక్టీరియా ఉంటాయి. అం తేకాదు పర్టిక్యులేట్ మ్యాటర్ (ాపీ), పాలీసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్‌లు (ాూఎలు) , ఓజోన్ (ా3), నైట్రోజన్ డయాక్సైడ్ (ీూ2), సల్ఫర్ డయాక్సైడ్ (ాూ2) వంటి హానికర కారకాలు ఉంటాయి. ఈ కారకాలు కేవలం చర్మంపైనే ఉండిపోవు, అవి చర్మంలోకి లోతుగా చొచ్చుకుపోతాయి. ఇవి ఇన్ఫ్లమేషన్‌కు కారణమై లోపలి నుంచి మీ చర్మానికి హాని చేస్తాయి.

**డార్క్ ప్యాచెస్‌కు కారణం అవుతాయి**

కాలుష్య కారకాలు చర్మం లోపలికి ప్రవేశించాక ఫ్రీ రాడికల్స్‌ను విడుదల చేస్తాయి. ఇవి అస్థిరమైన అణువులు, ఇవి చర్మ కణాల నుంచి ఎలక్ట్రాన్‌లను దొంగిలించి, వాటిని దెబ్బతీస్తాయి. చర్మం దానిని రక్షించుకోవడానికి మరింత మెలనిన్ ఉత్పత్తి చేస్తుంది. దీని కారణంగా ముఖంపై నల్లటి మచ్చలు, చర్మం కాంతి హీనంగా మారడం, అన్ఇవెన్ టోన్‌కు కారణం అవుతుంది.



**చర్మ రక్షణ పొరను బలహీనపరుస్తుంది**

చర్మ రక్షణ పొరను బలహీనపరుస్తుంది వాయు కాలుష్యం మీ చర్మ సహజ రక్షణను తొలగిస్తుంది. దీనివల్ల చర్మం సాధారణ సూర్యరశ్మికి కూడా అత్యంత సున్నితంగా మారుతుంది. దీని కారణంగా ఇది నల్ల మచ్చలు, మెలస్మా వంటి పాచెస్‌ను మరింత తీవ్రతరం చేస్తుంది. నిరంతరం కాలుష్యానికి గురైతే చర్మం ఒత్తిడికి గురై, కణాల పునరుత్పత్తి మందగిస్తుంది. చిన్న చిన్న మచ్చలు ఎక్కువ కాలం ఉండి, కాలక్రమేణా ముదురు రంగులోకి మారతాయి.

**చర్మం పొడిబారుతుంది**

కాలుష్య కారకాలు చర్మాన్ని డీహైడ్రేట్ చేస్తాయి. దీంతో చర్మం ఆకృతి, రూపు అసవానంగా మారుతుంది. కలుషితమైన గాలిలోని ఫ్రీ రాడికల్స్ పిగ్మెంటేషన్‌కు కారణం అవుతాయి. అంతే కాదు, చర్మం మడతలు పడేలా చేస్తుంది. మీలో చిన్నవయస్సులోనే వృద్ధాప్య ఛాయలు కనిపిస్తాయి.

**ఈ జాగ్రత్తలు తీసుకోండి**

కాలుష్యం నుంచి మీ చర్మాన్ని రక్షించుకోవడానికి బయట నుంచి ఇంటికి రాగానే వీలైతే స్నానం చేయండి. లేకపోతే మీ ముఖాన్ని, చేతులను శుభ్రం చేసుకోండి. ఈ చర్మంపై ఉన్న కాలుష్య కారకాలను తొలగిస్తాయి. బయటకు వెళ్లినప్పుడు ముఖానికి మాస్క్, స్కార్ఫ్‌గానీ ధరిస్తే మంచిది. వాయు కాలుష్యం కారణంగా చర్మం డీహైడ్రేట్ అవుతుంది. మీ చర్మాన్ని మృదువుగా ఉంచుకోవడానికి మాయిశ్చరైజర్ రాసుకోవడం మర్చిపోవద్దు. జోజోబా ఆయిల్, షియా బటర్ వంటి నేచురల్ మాయిశ్చరైజర్లనూ వాడొచ్చు.



# ట్రై సిరీస్ ఛాంపియన్ భారత్-ఏ... ఫైనల్లో శ్రీలంకపై ఘనవిజయం

శ్రీలంక వేదికగా జరిగిన ట్రై సిరీస్‌ను భారత్ ‘ఏ’ జట్టు కైవసం ఫైనల్లో శ్రీలంక ‘ఏ’ జట్టుపై 66 పరుగుల తేడాతో విక్టరీ యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ 29 బంతుల్లో 94 పరుగులతో విధ్వంసం లిస్ట్ ఏ క్రికెట్‌లో 11 బంతుల్లోనే వేగవంతమైన హాఫ్ సెంచరీ రికార్డు యశ్ ఠాకూర్, విప్రాజ్ నిగమ్ లకు చెరో మూడు వికెట్లు శ్రీలంక గడ్డపై జరిగిన ట్రై నేషన్ ‘ఏ’ సిరీస్‌ను భారత్ ‘ఏ’ జట్టు కైవసం చేసుకుంది. దంబుల్లా వేదికగా ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీలంక ‘ఏ’ జట్టుపై 66 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ (94; 29 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి భారత భారీ స్కోరుకు బలమైన పునాది వేశాడు. అనంతరం బౌలర్లు కూడా సమష్టిగా రాణించడంతో భారత్ సునాయాసంగా ట్రోఫీని అందుకుంది.ఛేదనలో శ్రీలంక పోరాటం 378 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆరంభంలోనే గట్టి దెబ్బ తగిలింది. భారత పేసర్ యశ్ ఠాకూర్ తన తొలి స్పెల్‌లోనే అవిష్క ఫెర్నాండో, నిరోషన్ డిక్వెల్లా, నువనిదు ఫెర్నాండో వంటి కీలక బ్యాటర్లను పెవిలియన్ చేర్చి శ్రీలంక టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. ఈ దశలో సదీర సమరవిక్రమ (52), వనుజ సహన్ (62) అర్ధ శతకాలతో ఆదుకునే ప్రయత్నం చేశారు. సహన్‌కు తోడు విజయకాంత్ వియస్కాంత్ (39) కూడా వేగంగా ఆడినా, భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో శ్రీలంక ఛేదన ఎప్పుడూ లక్ష్యం దిశగా సాగలేదు. చివరకు 47.1 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌట్ అయి ఓటమి పాలైంది.సూర్యవంశీ విధ్వంసం.. భారత భారీ స్కోరు ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన శ్రీలంక ‘ఏ’ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. అయితే, వారి నిర్ణయం తప్పని భారత ఓపెనర్లు నిరూపించారు. ముఖ్యంగా, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆడిన తీరు శ్రీలంక బౌలర్లకు చుక్కలు చూపించింది. కేవలం 11 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి లిస్ట్ ఏ క్రికెట్‌లో వేగవంతమైన అర్ధ శతకం నమోదు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ప్రియాంశ్ ఆర్య (39)తో కలిసి తొలి వికెట్‌కు కేవలం 8.5 ఓవర్లలోనే 132 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. శతకానికి కేవలం 6 పరుగుల దూరంలో సూర్యవంశీ ఔటయ్యాడు. అనంతరం కెప్టెన్ తిలక్ వర్మ (67), రుతురాజ్ గైక్వాడ్ (40), కుమార్ కుశాగ్ర (36) రాణించారు. చివర్లో అనుకుల్ రాయ్ (39; 15 బంతుల్లో) మెరుపులు మెరిపించడంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 377 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది.ఆల్రౌండ్ ప్రదర్శనతో భారత్ విజయం బ్యాటింగ్‌లో సూర్యవంశీ విధ్వంసానికి తోడు, బౌలర్లు కూడా రాణించడంతో భారత్‌కు విజయం సులువైంది. శ్రీలంక పతనాన్ని శాసించిన యశ్ ఠాకూర్, విప్రాజ్ నిగమ్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనుకుల్ రాయ్ రెండు వికెట్లతో రాణించాడు. టోర్నమెంట్‌లో నెమ్మదిగా ప్రారంభించినప్పటికీ, తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లు, ఫైనల్లో అద్భుత ప్రదర్శన కనబరిచి భారత్ ‘ఏ’ జట్టు ఆల్రౌండ్ ప్రదర్శనతో ట్రోఫీని గెలుచుకుంది.



## లిస్ట్-ఎ క్రికెట్‌లో నయా వరల్డ్ రికార్డ్.. 11 బంతుల్లోనే వైభవ్ సూర్యవంశీ అర్ధసెంచరీ!

- దంబుల్లా వేదికగా శ్రీలంక ‘ఎ’ జట్టుతో ముక్కోణపు టోర్నీ
- ఫైనల్లో భారత్ ‘ఎ’ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ విశ్వరూపం
- లిస్ట్-ఎ క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన అర్ధశతకం నమోదు
- 94 పరుగుల వద్ద సహాన్ అరాచ్చిగే బౌలింగ్‌లో అవుట్

భారత యువ క్రికెట్ సంచలనం, 15 ఏళ్ల ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్ ప్రపంచం అబ్బురపడేలా సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. శ్రీలంకలోని రంగిరి దంబుల్లా అంతర్జాతీయ స్టేడియం వేదికగా శ్రీలంక ‘ఎ’ జట్టుతో జరుగుతున్న ముక్కోణపు సిరీస్ ఫైనల్ మ్యాచ్‌లో వైభవ్ లంక బౌలింగ్‌ను తుత్తినియలు చేశాడు. కేవలం 11 బంతుల్లోనే అర్ధ సెంచరీ మార్కును దాటి, లిస్ట్-ఎ క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన అర్ధశతకాన్ని నమోదు చేసిన బ్యాటర్‌గా చరిత్రకెక్కాడు. టాస్ గెలిచి మొదట బౌలింగ్ ఎంచుకున్న శ్రీలంక జట్టు నిర్ణయాన్ని తలకిందులు చేస్తూ.. వైభవ్ తన అటాకింగ్ బ్యాటింగ్‌తో స్టేడియం నలుమూలలా బౌండరీల వర్షం కురిపించాడు.29 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్సర్లతో 94 పరుగులు చేసిన సూర్యవంశీ శ్రీలంక కెప్టెన్ సహాన్ అరాచ్చిగే బౌలింగ్‌లో వియాస్కాంత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరో ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య (24 బంతుల్లో 37)తో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించిన సూర్యవంశీ కేవలం 6.3 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 104 పరుగుల భారీ స్కోరును బోర్డుపై ఉంచాడు. ఐపీఎల్‌లో ఇప్పటికే సత్తా చాటిన ఈ బీహార్ కుర్రాడి దూకుడు ముందు కుగదాస్ మథులన్ వంటి లంక ప్రధాన బౌలర్లు సైతం చేతులెత్తేశారు. కెప్టెన్ తిలక్ వర్మ, సీనియర్ ఆటగాడు రుతురాజ్ గైక్వాడ్‌లతో కూడిన భారత్ ‘ఎ’ జట్టు ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచే పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ టైటిల్ దిశగా దూసుకుపోతోంది.ఈ మ్యాచ్ కేవలం ఫైనల్ మాత్రమే కాకుండా ఇరు జట్ల మధ్య ఉన్న పాత పగలకు వేదికగా మారింది. జూన్ 15న జరిగిన లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక ‘ఎ’ జట్టు వివాదాస్పద రీతిలో సూపర్ ఓవర్ గెలిచిన అనంతరం వైభవ్‌ను రెచ్చగొట్టడం, ఆపై మైదానంలో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య పెద్ద ఘర్షణ జరగడం తెలిసిందే. ఆ ఘటనలో వైభవ్‌కు జరిమానా పడినప్పటికీ.. నేడు దానికి తన పవర్‌ఫుల్ బ్యాటింగ్‌తోనే లంకకు సమాధానం ఇచ్చి ప్రతీకారం తీర్చుకున్నాడు. లీగ్ దశలో అఫ్ఘనిస్థాన్‌పై 101 పరుగుల భారీ విజయం సాధించి ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత్.. ఈ ఫైనల్లో లంకకు సొంత గడ్డపైనే చుక్కలు చూపిస్తోంది.



## ట్రై సిరీస్ ఫైనల్లో సూర్యవంశీ విధ్వంసం.. శ్రీలంక-ఏ ముందు 378 పరుగుల భారీ

ట్రై సిరీస్ ఫైనల్లో శ్రీలంక ‘ఏ’తో భారత్ ‘ఏ’ ఢీ సంచనల ఇన్నింగ్స్‌తో చెలరేగిన వైభవ్ సూర్యవంశీ కేవలం 29 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్సర్లతో 94 పరుగులు కెప్టెన్ తిలక్ వర్మ, గైక్వాడ్, అనుకూల్ రాయ్ కీలక ఇన్నింగ్స్‌లు 50 ఓవర్లలో 9 వికెట్లకు 377 పరుగులు శ్రీలంక వేదికగా జరుగుతున్న ముక్కోణపు ‘ఏ’ సిరీస్ ఫైనల్ మ్యాచ్‌లో భారత యువ బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించారు. ముఖ్యంగా, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (94; 29 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడిన విధ్వంసక ఇన్నింగ్స్‌తో శ్రీలంక ‘ఏ’ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతడి మెరుపులకు తోడు కెప్టెన్ తిలక్ వర్మ (67), రుతురాజ్ గైక్వాడ్ (40), అనుకూల్ రాయ్ (39) కీలక ఇన్నింగ్స్‌లు ఆడటంతో భారత ‘ఏ’ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 377 పరుగుల భారీ స్కోరు సాధించింది.దంబుల్లాలోని రంగిరి అంతర్జాతీయ స్టేడియంలో జరుగుతున్న ఈ ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన శ్రీలంక ‘ఏ’ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య (39)తో కలిసి వైభవ్ సూర్యవంశీ ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగాడు. ముఖ్యంగా సూర్యవంశీ క్రీజులోకి వచ్చినప్పటి నుంచే బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 11 బంతుల్లోనే అర్ధశతకం పూర్తిచేసి తన ఉద్దేశాన్ని స్పష్టం చేశాడు. అతడి ధాటికి భారత స్కోరుబోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. కేవలం 8.5 ఓవర్లకే భారత్ 132 పరుగులు చేసిందంటే సూర్యవంశీ ఏ స్థాయిలో చెలరేగాడో అర్థం చేసుకోవచ్చు. శతకం ఖాయం అనుకున్న దశలో, అతను 94 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔటయ్యాడు.సూర్యవంశీ సృష్టించిన బలమైన పునాదిపై మిగతా బ్యాటర్లు రాణించారు. మరో ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య కూడా వేగంగా ఆడి ఔటయ్యాక, రుతురాజ్ గైక్వాడ్, కెప్టెన్ తిలక్ వర్మ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. గైక్వాడ్ నెమ్మదిగా ఆడినా, తిలక్ వర్మ బాధ్యతాయుతమైన అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 84 పరుగులు జోడించారు. ఆ తర్వాత కుమార్ కుశాగ్ర (36) వేగంగా ఆడాడు. చివర్లో, ఆల్‌రౌండర్ అనుకూల్ రాయ్ కేవలం 15 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 39 పరుగులు చేసి స్కోరును 370 దాటించడంలో కీలక పాత్ర పోషించాడు. ఒక దశలో 400 పరుగులు దాటేలా కనిపించినా, చివర్లో వరుసగా వికెట్లు కోల్పోవడంతో భారత్ 377 పరుగులకు పరిమితమైంది. శ్రీలంక బౌలర్లలో రవిందు ఫెర్నాండో, వనుజ సహన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. వనుజ సహన్ (2/39), విజయకాంత్ వయస్కాంత్ (0/36) మినహా మిగతా బౌలర్లందరూ భారీగా పరుగులు సమర్పించుకున్నారు.

## టీ20 క్రికెట్‌లో కొత్త రారాజు.. గేల్ ను అధిగమించిన పొలార్డ్



టీ20 క్రికెట్‌లో క్రిస్ గేల్ రికార్డును బద్దలుకొట్టిన కీరన్ పొలార్డ్ మేజర్ లీగ్ క్రికెట్‌లో సెంచరీతో ఈ ఘనత సాధించిన విండీస్ ఆల్‌రౌండర్ 14,562 పరుగుల గేల్ రికార్డును దాటి 14,582 పరుగులతో అగ్రస్థానానికి పదేళ్లకు పైగా అగ్రస్థానంలో కొనసాగిన గేల్ ఆధిపత్యానికి ముగింపు టీ20ల్లో 10,000 పరుగులు, 300 వికెట్లు తీసిన ఏకైక ఆటగాడిగా రికార్డ్ వెస్టిండీస్ విధ్వంసకర ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్ టీ20 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఇప్పటివరకు ఈ రికార్డును తన పేరిట ఉంచుకున్న సహచర ఆటగాడు క్రిస్ గేల్‌ను పొలార్డ్ అధిగమించాడు. మేజర్ లీగ్ క్రికెట్ (మీజ) 2026 సీజన్‌లో భాగంగా ఆదివారం ఈ ఘనత సాధించాడు.డల్లాస్‌లో వాషింగ్టన్ ఫ్రీడమ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎంఐ న్యూయార్క్ తరఫున ఆడిన పొలార్డ్, అజేయ శతకంతో (100లి పరుగులు, 56 బంతుల్లో) చెలరేగాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతను టీ20ల్లో తన మొత్తం పరుగుల సంఖ్యను 14,582కు పెంచుకున్నాడు. దీంతో, 14,562 పరుగులతో పదేళ్లకు పైగా (4,463 రోజులు) అగ్రస్థానంలో ఉన్న క్రిస్ గేల్ రికార్డు బద్దలైంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్టు 245 పరుగులు చేయగా, పొలార్డ్ సెంచరీ చేసినప్పటికీ ఎంఐ మ్యాచ్‌లు ఆడి ఈ మైలురాయిని చేరుకున్నాడు.

## ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్: భారత జట్టు ప్రకటన.. కోహ్లీ, బుమ్రా రీఎంట్రీ.. జైస్వాల్ ఔట్



ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు 15 మందితో భారత జట్టును ప్రకటించిన బీసీసీఐ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్‌కు బాధ్యతలు గాయం నుంచి కోలుకున్న విరాట్ కోహ్లీ, విశ్రాంతి తర్వాత బుమ్రా పునరాగమనం కోహ్లీ రాకతో సెంచరీ చేసిన యశస్వి జైస్వాల్‌ను తప్పించిన సెలక్టర్లు గాయం కారణంగా ఐర్లాండ్ టీ20 సిరీస్‌కు వరుణ్ చక్రవర్తి దూరం ఇంగ్లండ్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 15 మంది సభ్యులతో కూడిన జట్టును ఆదివారం ప్రకటించింది. సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా జట్టులోకి పునరాగమనం చేశారు. జూలై 14న ప్రారంభం కానున్న ఈ పర్యటనకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, శ్రేయస్ అయ్యర్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు.ఐపీఎల్ 2026 సందర్భంగా కండరాల గాయంతో బాధపడిన విరాట్ కోహ్లీ, ఇటీవలే ముగిసిన ఆఫ్ఘనిస్థాన్ సిరీస్‌కు దూరమైన విషయం తెలిసిందే. అయితే, అతను పూర్తి ఫిట్‌నెస్ నిరూపించుకున్న తర్వాతే తుది జట్టులో ఆడతాడని బీసీసీఐ స్పష్టం చేసింది. ఇక, పనిభారం కారణంగా ఆఫ్ఘనిస్థాన్ సిరీస్‌కు విశ్రాంతి తీసుకున్న జస్ప్రీత్ బుమ్రా కూడా తిరిగి జట్టులోకి వచ్చాడు. ఇంగ్లండ్ పరిస్థితుల్లో భారత పేస్ దాడికి అతడు నాయకత్వం వహించనున్నాడు.ఆఫ్ఘనిస్థాన్‌పై చివరి వన్డేలో సెంచరీతో అదరగొట్టిన యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌పై సెలక్టర్లు వేటు వేశారు. కోహ్లీ రాకతో అతడికి చోటు దక్కలేదు. మరోవైపు, సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఈ సిరీస్‌కు కూడా ఎంపిక కాలేదు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గాయం నుంచి కోలుకుంటున్న క్రమంలో అతను ఇంకా పూర్తి ఫిట్‌నెస్ సాధించలేదని తెలుస్తోంది. గత సిరీస్‌లో ఆకట్టుకున్న లెఫ్ట్ ఆర్మ్ పేసర్ గుర్నూర్ బ్రార్ తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు.ఇంగ్లండ్‌లో భారత పర్యటన జూలై 14న ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి వన్డేతో ప్రారంభమవుతుంది. రెండో వన్డే జూలై 16న సోఫియా గార్డెన్స్‌లో, మూడో వన్డే జూలై 19న చారిత్రక లార్డ్స్ మైదానంలో జరగనుంది.ఐర్లాండ్ సిరీస్‌కు వరుణ్ చక్రవర్తి దూరంఇదిలా ఉండగా, స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఐర్లాండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు దూరమైనట్లు బీసీసీఐ ధ్రువీకరించింది. ఐపీఎల్ 2026లో ఎడమ కాలికి గాయపడిన అతను ప్రస్తుతం కోలుకుంటున్నాడని, పునరావాసం చివరి దశలో ఉందని బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. భారత్, ఐర్లాండ్ మధ్య టీ20 సిరీస్ జూన్ 26 నుంచి జరగనుంది.ఇంగ్లండ్ పర్యటనకు భారత వన్డే జట్టు:శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్-కెప్టెన్), కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, నితీశ్ కుమార్ రెడ్డి, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, గూరనూర్ బ్రార్.(లిఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉంటుంది) ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టు (సవరించిన):శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, తిలక్ వర్మ (వైస్-కెప్టెన్), నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, ప్రసిద్ధ్ కృష్ణ..

# ఫ్యాన్స్ కు పూనకాలే!

## పవన్ కల్యాణ్ కు 'ఓజీ2' కథ చెప్పిన సుజీత్.



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఓజీ' సీక్వెల్‌పై కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఓజీ2 కోసం ప్రీ-ప్రొడక్షన్ చర్చలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. దర్శకుడు సుజీత్... పవన్ కు ఓజీ2 కథ వినిపించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సోషల్ మీడియా ద్వారా ఓ ప్రకటన విడుదల చేసింది. ఇచ్చిన మాట ప్రకారం చర్చలు మొదలయ్యాయని, దర్శకుడు సుజీత్ ... పవన్ తో సమావేశంలో పాల్గొన్నారని వెల్లడించింది.
సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ క్రైమ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన 'దే కాల్ హిమ్ ఓజీ' (2025) చిత్రంపై మొదటి నుంచీ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా విజన్ తనకు ఎంతగానో నచ్చిందని, దీనిని ఒక యూనివర్స్‌గా (సీక్వెల్స్, ప్రీక్వెల్స్) విస్తరించే ఆలోచన ఉందని పవన్ కళ్యాణ్ గతంలో పలు సందర్భాల్లో తెలిపారు. ఇప్పుడు ఆ దిశగా అడుగులు పడుతుండటంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం క్రియేటివ్ వర్క్స్ కార్యాలయంలో దర్శకుడు సుజీత్, పవన్ మధ్య చర్చలు జరగడం ఓజీ2 ప్రాజెక్ట్‌పై కదలిక మొదలైందనడానికి సంకేతంగా నిలుస్తోంది.
ఈ వార్త తెలియగానే పవన్ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో సంబరాలు చేసుకుంటున్నారు.
ఓజీ2 హ్యాష్‌ట్యాగ్‌తో పోస్టులు, మీమ్స్ ట్రెండ్ అవుతున్నాయి. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరిన్ని వివరాలు వెలువడే అవకాశం ఉంది.

# అనిల్ రావిపూడి రక్తంతో విజయ తిలకం దిద్దిన టీం...

## దర్శకుడి రక్తంతో విజయతిలకం దిద్దుతూ ఫన్నీ వీడియో విడుదల




విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్ రామ్ తొలిసారి కలిసి నటిస్తున్న భారీ మల్టీస్టారర్‌కు సంబంధించిన ప్రమోషన్లు వినూత్నంగా మొదలయ్యాయి. స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభానికి ఒక రోజు ముందు, చిత్ర యూనిట్ 'కత్తిలాంటి ఐడియా' పేరుతో ఒక సరదా వీడియోను విడుదల చేసింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.
షైన్ స్క్రీన్స్ నిర్మాణ సంస్థ షేర్ చేసిన ఈ ప్రమోషనల్ వీడియోలో దర్శకుడు అనిల్ రావిపూడి ఒక కత్తి పట్టుకుని, "ఎప్పుడూ ఐడియాలు నేనే ఇవ్వాలా" అంటూ సరదాగా అసహనం వ్యక్తం చేస్తారు. వెంటనే వెంకటేష్ ఆయన చేతిని కత్తితో సరదాగా కోసి, ఆ రక్తంతో విజయ తిలకం దిద్దుతారు. ఆ తర్వాత కల్యాణ్ రామ్, కీర్తి సురేశ్, కృతి శెట్టి కూడా అదే అనుసరించడంతో అనిల్ రావిపూడి ఫన్నీగా స్పందిస్తారు. రాయలసీమ నేపథ్యం అనగానే ఫ్యాక్షన్ అనుకోవద్దని, ఇది పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని ఆయన ఈ వీడియో ద్వారా స్పష్టం చేశారు.
ఈ సినిమా జూన్ 22 నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనుంది. ఇటీవలే హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ఈ ప్రాజెక్ట్ లాంఛనంగా ప్రారంభమైంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తుండగా, సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సౌత్ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయి. కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్లుగా నటిస్తుండగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. 2027 సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తన సినిమాలకు విభిన్నంగా ప్రచారం చేయడంలో పేరున్న అనిల్ రావిపూడి, ఈసారి కూడా అదే శైలిని కొనసాగించారు.

# శ్రుతి క్లారిటీతో కొత్త సస్పెన్స్ స్టార్ట్!



సౌత్ సినీ ఇండస్ట్రీలో ప్రస్తుతం అత్యంత ఆసక్తి రేకెత్తిస్తున్న ప్రాజెక్టుల్లో డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించనున్న రజినీకాంత్- కమల్ హాసన్ మల్టీస్టారర్ ఒకటి. అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చినప్పటి నుంచే ఈ భారీ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో అంచనాలు పెరుగుతూనే ఉన్నాయి. సినిమా ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నప్పటికీ, దీనికి సంబంధించిన ప్రతి చిన్న వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇటీవల ఈ సినిమాకు సంబంధించి ఎక్కువగా వినిపించిన పేరు శృతి హాసన్‌ది. కమల్ హాసన్ కూతురు కావడంతో పాటూ, రజినీకాంత్ హీరోగా వచ్చిన కూలీ సినిమాలో ఆమె ఇప్పటికే నటించడం వల్ల ఈ కొత్త మల్టీస్టారర్‌లో కూడా ఆమె నటించే అవకాశాలున్నాయనే ప్రచారం జోరుగా సాగింది. ముఖ్యంగా రజినీ- కమల్ వంటి ఇద్దరు దిగ్గజాలు కలిసి నటిస్తున్న సినిమాలో శృతి హాసన్ ఉంటే ఆ వార్తకు మరింత ప్రత్యేకత వస్తుందని అభిమానులు భావించారు. అయితే ఈ ఊహాగానాలకు తాజాగా శృతి హాసన్ స్వయంగా చెక్ పెట్టినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌లో తాను భాగం కాలేదని ఆమె స్పష్టం చేసినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీంతో కొంతకాలంగా కొనసాగుతున్న రూమర్స్‌కు ఫుల్ స్టాప్ పడినట్టే కనిపిస్తోంది. కానీ శృతి పేరు ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంతో ఇప్పుడు మరో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. అదే హీరోయిన్ కాస్టింగ్. ఇద్దరు లెజెండరీ స్టార్లు ప్రధాన పాత్రల్లో కనిపించనున్న ఈ సినిమాలో హీరోయిన్‌గా ఎవరిని ఎంపిక చేస్తారు? అనే ప్రశ్న ఇప్పుడు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. కథలో హీరోయిన్ పాత్ర ఎంత ప్రాధాన్యత కలిగి ఉంటుంది? సీనియర్ స్టార్ హీరోయిన్‌ను తీసుకుంటారా? లేక పాన్ ఇండియా మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని కొత్త ఎంపిక వైపు వెళ్తారా? అనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఇక డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ వ్యవహరిస్తున్న తీరు కూడా చర్చనీయాంశంగా మారింది. జైలర్ తర్వాత తన ప్రాజెక్టుల విషయంలో నెల్సన్ ఎక్కువ సీక్రసీ మెయింటైన్ చేస్తున్న సంగతి తెలిసిందే. నటీనటుల ఎంపిక నుంచి కథకు సంబంధించిన కీలక అంశాల వరకు అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చేంత వరకు ఎలాంటి సమాచారం బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ మల్టీస్టారర్ విషయంలో కూడా అదే వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది.

# బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న 'మా ఇంటి బంగారం'.. రెండు రోజుల్లో ఎంత కొల్లగొట్టిందంటే..!




స్టార్ నటి సమంత ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. 'ఓ బేబీ' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత దర్శకురాలు నందిని రెడ్డి, సమంత కాంబినేషన్‌లో వచ్చిన ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీకి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ నెల 19న (శుక్రవారం) విడుదలైన ఈ సినిమా, మొదటి ఆట నుంచే మంచి టాక్‌ను సొంతం చేసుకుంది.విడుదలైన మొదటి రోజే రూ. 13 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టిన 'మా ఇంటి బంగారం', రెండో రోజు శనివారం కూడా తన జోరును కొనసాగించింది. వీకెండ్ కావడంతో కలెక్షన్లు మరింత పెరిగాయి. శనివారం ఒక్కరోజే రూ. 15 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, మొదటి రోజును మించిన వృద్ధిని కనబరిచింది. దీంతో రెండు రోజులకు కలిపి సినిమా మొత్తం రూ. 28 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు సాధించినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.సినిమాకు వచ్చిన మంచి టాక్, సమంత నటనకు తోడు వారాంతం కావడంతో ప్రేక్షకులు థియేటర్లకు క్యూ కడుతున్నారు. ఇక, ఈరోజు (ఆదివారం) కూడా సెలవు దినం కావడంతో వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# యశ్ 'టాక్సిక్' కొత్త రిలీజ్ డేట్ వచ్చేసింది.. పండగల సీజన్‌లో భారీగా విడుదల




కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' విడుదల తేదీపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. ఈ సినిమాను ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. గత కొద్ది రోజులుగా ఈ సినిమా ఆగిపోయిందంటూ వస్తున్న ఊహాగానాలకు ఈ ప్రకటనతో మేకర్స్ చెక్ పెట్టారు.నేడు చిత్ర నిర్మాతలు సరికొత్త పోస్టర్‌తో పాటు విడుదల తేదీని వెల్లడించారు. ఈ పోస్టర్‌లో యశ్ 'రాయ', 'టికెట్' అనే రెండు విభిన్నమైన, పవర్‌ఫుల్ అవతారాల్లో కనిపించి ప్రేక్షకుల్లో ఉత్కంఠను రేకెత్తించారు. ఇది కేవలం తండ్రీకొడుకుల కథ మాత్రమే కాదని, వారి మధ్య ఉన్న ఉద్రిక్తత, అధికారం, సంక్లిష్టమైన భావోద్వేగాల చుట్టూ ఈ సినిమా తిరుగుతుందని పోస్టర్ సూచిస్తోంది.
ఈ సినిమా విడుదల తేదీని వ్యూహాత్మకంగా ఎంచుకున్నారు. 2026 ఆగస్టు చివరి వారంలో వరలక్ష్మీ వ్రతం, ఓనం, ఈద్, రక్షాబంధన్ వంటి వరుస పండగలు రానున్నాయి. ఈ సెలవులను పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా వారాంతానికి ముందే సినిమాను విడుదల చేస్తున్నారు. దీనివల్ల దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో భారీ ఓపెనింగ్స్ సాధించవచ్చని చిత్రవర్గాలు భావిస్తున్నాయి.నిజానికి ఈ చిత్రాన్ని మొదట మార్చి 19న, ఆ తర్వాత జూన్ 4న విడుదల చేయాలని భావించారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయాలనే ప్రణాళికతో పాటు, అంతర్జాతీయ డిస్ట్రిబ్యూషన్ భాగస్వామ్యాల కోసం విడుదల తేదీని వాయిదా వేస్తూ వచ్చారు.
విలక్షణ చిత్రాల దర్శకురాలు గీతూ మోహన్‌దాస్, రాకింగ్ స్టార్ యశ్ కాంబినేషన్‌లో వస్తున్న తొలి సినిమా ఇది. కేవీఎన్ ప్రొడక్షన్స్, యశ్ సొంత నిర్మాణ సంస్థ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, హ్యూమా ఖురేషి, రుక్మిణి వసంత్, తారా సుతారియా వంటి ప్రముఖ తారలు నటిస్తున్నారు. కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.



# ట్రోల్స్ నుంచి టాప్ లైనప్ వరకు!

టాలీవుడ్‌లో యంగ్ హీరోల మధ్య పోటీ రోజురోజుకీ పెరుగుతున్న సమయంలో, తన కెరీర్‌ను కొత్త దిశలో తీసుకెళ్తున్న నటుడు కిరణ్ అబ్బవరం. ఒకప్పుడు వరుస ఫ్లాప్‌లు, సోషల్ మీడియా ట్రోల్స్, మార్కెట్‌పై అనుమానాల మధ్య ఇబ్బందులు ఎదుర్కొన్న ఈ యంగ్ హీరో, ఇప్పుడు మాత్రం పూర్తిగా భిన్నమైన పరిస్థితిని ఆస్వాదిస్తున్నారు. దీనికి ప్రధాన కారణంగా నిలిచింది మాత్రం క సినిమానే. ఈ సినిమా రిలీజ్ కు ముందు కిరణ్ అబ్బవరం కెరీర్‌పై అనేక ప్రశ్నలు వినిపించాయి. వరుస సినిమాలు ఆశించిన ఫలితాలు అందుకోకపోవడంతో ఆయన ఫ్యూచర్ కెరీర్ పై సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే క సినిమా కేవలం కమర్షియల్ సక్సెస్‌నే కాదు, కిరణ్‌పై ఇండస్ట్రీలో ఉన్న అభిప్రాయాన్ని కూడా మార్చేసింది. ముఖ్యంగా కథల ఎంపికలో కొత్త దృక్పథాన్ని చూపించగలడనే నమ్మకాన్ని ఈ సినిమా తీసుకొచ్చింది. అదే సమయంలో కిరణ్‌లో కూడా ఆ సినిమా కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపింది ఈ సక్సెస్ తో కిరణ్ అబ్బవరం ఆగకుండా తన కెరీర్‌ను విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నారు. హీరోగా సినిమాలు చేయడమే కాకుండా, నిర్మాతగా మరియు డైరెక్టర్ గా కూడా తన సామర్థ్యాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న రియాలిటీ ప్రాజెక్ట్ ఇండస్ట్రీలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఒక నటుడు స్వయంగా కథపై నమ్మకంతో మెగాఫోన్ పట్టడమనేది చిన్న విషయం కాదు. దీంతో కిరణ్ తనపై ఉన్న విశ్వాసాన్ని మరింత బలంగా చాటుతున్నారని చెప్పాలి.అదే సమయంలో నిర్మాతగా కూడా ఆయన కొత్త ప్లాన్స్ రూపొందిస్తున్నారు. ఒకవైపు చెన్నై లవ్ స్టోరీ రిలీజ్ కు సిద్ధమవుతుండగా, మరోవైపు క2 స్క్రిప్ట్ పనులు వేగంగా సాగుతున్నాయి. క ఇచ్చిన సక్సెస్ ఆ ఫ్రాంచైజీ స్థాయికి తీసుకెళ్లాలనే ఆలోచన స్పష్టంగా కనిపిస్తోంది. అంతేకాదు, సుకుమార్ రైటింగ్స్‌లో రూపొందబోయే కొత్త ప్రాజెక్ట్ కూడా కిరణ్ కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా భావిస్తున్నారు. సినిమాలతో పాటు ఓటీటీ రంగంలో కూడా కిరణ్ అడుగులు వేస్తున్నారు. డియర్ కామ్రేడ్ ఫేమ్ భరత్ కమ్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న గువ్వల చెరువు ఘాట్ వెబ్ సిరీస్‌పై ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. అలాగే కాంతార టీమ్‌కు చెందిన శ్రీకాంత్ పుప్పాల దర్శకత్వంలో రూపొందనున్న మిస్టికల్ థ్రిల్లర్ ఆయన తొలి పాన్ ఇండియా ప్రయత్నంగా నిలవనుంది. ఒకప్పుడు ట్రోల్స్‌కు టార్గెట్ అయిన కిరణ్ అబ్బవరం, ఇప్పుడు తన లైనప్‌తోనే చర్చనీయాంశంగా మారడం విశేషం. హీరోగా మాత్రమే కాకుండా డైరెక్టర్, ప్రొడ్యూసర్, ఓటీటీ యాక్టర్, పాన్ ఇండియా హీరోగా విభిన్న మార్గాల్లో ముందుకు సాగుతున్న ఆయన ప్రయాణం చూస్తుంటే, క సినిమా నిజంగానే ఆయన కెరీర్‌ను పూర్తిగా మార్చేసిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పుడు ఈ భారీ ప్రణాళికలను విజయవంతంగా అమలు చేయగలిగితే, యంగ్ హీరోల రేసులో కిరణ్ అబ్బవరం మరింత బలమైన స్థానాన్ని సంపాదించే అవకాశం కనిపిస్తోంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613